తెలుగు దినపత్రిక

# సిరి

People's Voice వార్త పత్రిక

RNI TG TEL/ 26/A0381

11-10-2026

ఆదివారం హైదరాబాద్

సంపుటి: (volume): 1

సంచిక: (ISSUE): 243

PUBLISHED FROM HYDERABAD పేజీలు- 10 వెల:రూ.4 /-




## తెలంగాణకే ప్రత్యేకమైన పూల పండుగ

# బతుకమ్మ

పూలను ఓ ఆకారంగా పేర్చి దేవుడిగా పూజించడం అనేది ప్రపంచంలో ఎక్కడ కనిపించదు. ఒక్క తెలంగాణలో మాత్రం బతుకమ్మ పేరుతో పూలను పూజించే సంప్రదాయం తరతరాలుగా కొనసాగుతోంది. తెలంగాణలోని ప్రతీ ఆడపడుచు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూసే బతుకమ్మ పండుగ రానే వచ్చింది. యువతులు, ముత్తైదువులు ఆడుతూ పాడుతూ చూపరులను అలరించే అరుదైన వేడుక ఈ బతుకమ్మ పండగ. మహాలయ అమావాస్యతో ప్రారంభమై 9 రోజుల పాటు వైభవంగా సాగే ఈ పండగ శనివారం ప్రారంభంకానుంది.

## ఢిల్లీ అంతటా నిర్బంధాల పర్వం



- సీఈసీ రాజీనామా డిమాండ్‌తో రాజధానిలో తీవ్ర ఉద్రిక్తత
- విమానంలోనే కాక్రోచ్ జనతా పార్టీ నేతల నిర్బంధం
- వేలాదిమంది కార్యకర్తలను అదుపులోకి తీసుకున్న పోలీసులు
- మమతా బెనర్జీ, కేజ్రీవాల్ సహా ప్రతిపక్ష నేతలపై చర్యలు
- ధ్రువ్ రాఠీ, విద్యార్థులు, జర్నలిస్టుల నిర్బంధం
- 45 మెట్రో స్టేషన్లపై ఆంక్షలు, వందలాది రైళ్లకు అంతరాయం
- పోలీసు చర్యలపై దేశవ్యాప్త విమర్శలు
- ఎస్ఐఆర్‌పై ఎన్నికల సంఘాన్ని నిలదీస్తున్న ప్రతిపక్షాలు

4

## నువ్వింకా బతికే ఉన్నావా?



- పురుగుల మందు తాగి చావలేదా?
- సమస్య చెప్పుకోడానికి వచ్చిన రైతుపై గజ్వేల్ తహశీల్దార్ స్వామి వెకిలి నవ్వులు
- అహంకారపూరిత వ్యాఖ్యలపై భగ్గుమన్న సమాజం
- బాధను చూసి నవ్వొస్తుందా అంటే.. 'అవును వస్తుంది' అంటూ వెటకారం
- సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారిన వీడియో
- అధికారి ప్రవర్తనపై ఆగ్రహం వ్యక్తం చేసిన కేటీఆర్

**తెలంగాణ బ్యూరో, అక్టోబర్ 10 (సిరి న్యూస్):**

ప్రజా సమస్యలను పరిష్కరించి బాధితులకు అండగా నిలవాల్సిన రెవెన్యూ అధికారుల తీరు అమానవీయ స్థాయికి దిగజారుతోంది. తన వ్యవసాయ భూమి సమస్యను పరిష్కరించాలని వేడుకోవడానికి కార్యాలయానికి వచ్చిన ఓ నిరుపేద రైతు పట్ల సిద్దిపేట జిల్లా గజ్వేల్ తహశీల్దార్ స్వామి అత్యంత కర్కశంగా, అహంకారపూరితంగా వ్యవహరించిన వైనం రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర సంచలనం సృష్టిస్తోంది. గజ్వేల్ మండలం మక్త మాన్సాన్‌పల్లి గ్రామానికి చెందిన రైతు యేసు తన భూ వివాదంపై ఎన్నో రోజులుగా కార్యాలయాల చుట్టూ తిరుగుతూ, న్యాయం చేయాలని తహశీల్దార్‌ను సంప్రదించాడు.

మిగతా 2వ పేజీలో..




# రెవెన్యూలో ప్రక్షాళనకు కసరత్తు !

### 22ఏ భూ వివాదాల ఎఫెక్ట్..

**(తెలంగాణ బ్యూరో - సిరి న్యూస్)**

రాష్ట్ర రెవెన్యూ శాఖలో భారీ ఎత్తున బదిలీలకు రంగం సిద్ధమవుతోంది. భూ సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం, 22ఏ నిషేధిత భూముల జాబితా వివాదాలు, క్షేత్రస్థాయి అధికారుల పనితీరుపై వెల్లువెత్తుతున్న ఫిర్యాదుల నేపథ్యంలో ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకునే దిశగా అడుగులు వేస్తోంది. ముఖ్యంగా తహశీల్దార్లు, ఆర్డీవోల స్థాయి అధికారులను పెద్ద సంఖ్యలో బదిలీ చేసేందుకు రంగం సిద్ధమైనట్లు సచివాలయ వర్గాల్లో చర్చ సాగుతోంది. ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియ పూర్తయిన వెంటనే ఈ స్థానచలనాలకు శ్రీకారం చుట్టనున్నట్లు సమాచారం.

**22ఏ నిషేధిత జాబితా వివాదాలతో తలనొప్పులు..**

రాష్ట్రవ్యాప్తంగా 22ఏ నిషేధిత భూముల జాబితా వ్యవహారం ప్రభుత్వానికి తీవ్ర సంక్లిష్ట సమస్యగా మారింది. గతంలో క్షేత్రస్థాయి రెవెన్యూ అధికారులు క్షేత్ర పరిశీలన చేయకుండానే అనేక ప్రైవేటు, పట్టా భూములను నిషేధిత జాబితాలో చేర్చడం వల్ల లక్షలాది మంది భూ యజమానులు రిజిస్ట్రేషన్లు కాక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

మిగతా 2వ పేజీలో..

- తహశీల్దార్లు, ఆర్డీవోల్లో మొదలైన టెన్షన్
- నవంబర్‌లో భారీగా స్థానచలనాలు
- మార్గదర్శకాలిచ్చినా కదలని భూ సమస్యల పరిష్కార ఫైళ్లు
- అర్హులైన రైతులు, భూ యజమానులకు తప్పని తిప్పలు
- కొందరు అధికారులపై వెల్లువెత్తుతున్న అవినీతి ఆరోపణలు
- ఎస్ఐఆర్ ప్రక్రియ ముగియగానే బదిలీల ప్రక్రియ ప్రారంభం
- క్షేత్రస్థాయి అధికారుల పనితీరుపై ప్రభుత్వ నిఘా వర్గాల ఆరా
- స్థానచలనాల వార్తలతో రెవెన్యూ వర్గాల్లో సర్వత్రా ఉత్కంఠ

## ఎంఎస్ఎంఈల కోసం సెంటర్ ఆఫ్ ఎక్స్ లెన్స్



- సమస్యల పరిష్కారానికి నెలకోసారి ఎంఎసఎంఈ గ్రీవెన్స్ డే
- నగరంలోని పారిశ్రామికవాడల అభివృద్ధికి చర్యలు
- ఎల్ యూబీ ఎంఎస్ఎంఈ సౌత్ ఇండియా సమ్మిట్‌లో మంత్రి శ్రీధర్‌బాబు

3

### సృజనాత్మక ఆలోచనలకు ప్రోత్సాహం

- ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల

3




## సంక్షేమ పథకాలే కాంగ్రెస్ విజయానికి బలం

- ప్రతీ పట్టభద్రుడిని ఓటరుగా నమోదు చేయించాలి
- సర్వోత్తమ్ రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలి
- పార్టీ శ్రేణులకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పిలుపు

**ఖమ్మం, సిరి న్యూస్ అక్టోబర్ 10 :**

ఖమ్మంనల్గొండవరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ కాంగ్రెస్ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించేందుకు పార్టీ శ్రేణులంతా సమష్టిగా కృషి చేయాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. పట్టభద్రుల ఓటరు నమోదు కార్యక్రమాన్ని ఉద్యమంలా చేపట్టి అర్హులైన ప్రతి ఒక్కరినీ ఓటరుగా

మిగతా 2వ పేజీలో..

## ఉద్యమకారుడి కుటుంబానికి కేటీఆర్ అండ

- ముగ్గురు కుమార్తెలకు రూ.9 లక్షల ఫిక్స్‌డ్ డిపాజిట్లు
- కుటుంబ ఖర్చుల కోసం భార్యకు రూ.లక్ష ఆర్థిక సహాయం
- జనార్దన్ కుటుంబానికి బీఆర్ఎస్ నేతల పరామర్శ

2



## ఆర్టీసీ ఎన్నికల్లో ఈయూ కూటమి హవా

- అధికార టీడబ్ల్యూయుకు కార్మికుల షాక్!
- ఎంప్లాయిస్ యూనియన్ కూటమి ఘనవిజయం
- కాంగ్రెస్, టీఆర్ఎస్ అనుబంధ టీఎంయూలకు నిరాశ
- 17న వెలువడనున్న రీజయన్ల వారీ అధికారిక ఫలితాలు

2



## దేశ ప్రగతికి ఎంఎస్ఎంఈలే ప్రధాన చోదక శక్తులు

- జీడీపీలో 32%, ఎగుమతుల్లో 49% వాటా చిన్న పరిశ్రమలదే
- 40 కోట్లకుపైగా ప్రజలకు ఉపాధి కల్పిస్తున్న లఘు పరిశ్రమలు
- 2047 నాటికి 'వికసిత్ భారత్' సాధనలో వీటివిజుల పాత్ర కీలకం
- 'లఘు ఉద్యోగ్ భారతి – సౌత్ ఇండియా కాంక్లేవ్'లో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి



**హైదరాబాద్, సిరి న్యూస్ , అక్టోబర్ 10 :**

దేశంలో ఉద్యోగ కల్పనతోపాటు 2047 నాటికి వికసిత్ భారత్‌గా రూపుదిద్దడంలో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు (ఎంఎస్ ఎంఈలు) కీలకమైన ఇంజిన్‌గా వ్యవహరిస్తాయని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి పేర్కొన్నారు. కేవలం పెద్ద పరిశ్రమల ద్వారానే కాక గ్రామాలు, పట్టణాలు, పారిశ్రామిక ప్రాంతాల్లోని ఎంఎస్ఎంఈలు బలోపేతమైనప్పుడే

మిగతా 3వ పేజీలో..




# ఆర్టీసీ ఎన్నికల్లో ఈయూ కూటమి హవా

- అధికార టీడబ్ల్యూయూకు కార్మికుల షాక్!
- ఎంప్లాయిస్ యూనియన్ కూటమి ఘనవిజయం
- కాంగ్రెస్, టీఆర్ఎస్ అనుబంధ టీఎంయూలకు నిరాశ
- 17న వెలువడనున్న రీజియన్ల వారీ అధికారిక ఫలితాలు

**హైదరాబాద్,సిరి న్యూస్, అక్టోబర్ 10:**
రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థలో సుదీర్ఘ విరామం తర్వాత నిర్వహించిన గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల పోలింగ్ ప్రక్రియ శుక్రవారం ప్రశాంతంగా ముగిసింది. ప్రాథమిక వివరాలు, అందిన సమాచారం ప్రకారం ఆర్టీసీ కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలోని ఎంప్లాయిస్ యూనియన్ (ఈయూ) కూటమి రాష్ట్రస్థాయి గుర్తింపు సంఘం ఎన్నికల్లో తిరుగులేని విజయం సాధించి సంస్థపై పట్టు నిలుపుకుంది. కాగా, ప్రభుత్వం బాహాటంగా అండదండలు అందించిన తెలంగాణ వర్కర్స్ యూనియన్ (టీడబ్ల్యూయూ)కు కార్మికులు గట్టి షాక్ ఇవ్వడం రాష్ట్ర రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. అయితే రీజియన్లు, నాన్ ఆపరేటింగ్ యూనిట్లలో స్థానిక గుర్తింపు ఎవరికి దక్కిందనే విషయంలో ఇంకా పూర్తి స్పష్టత రాలేదు. ప్రాథమిక సమాచారం ప్రకారం తెలంగాణ మజ్దూర్ యూనియన్ (టీఎంయూ) మూడు రీజియన్లు, టీడబ్ల్యూయూ ఐదారు రీజియన్లలో స్థానిక గుర్తింపు దిశగా ఆధిక్యంలో ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది. రీజియన్ల వారీగా తుది అధికారిక ఫలితాలను ఈ నెల 17న ఎన్నికల అధికారులు ప్రకటించనున్నారు. ఈ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీ.. అశ్వత్థామరెడ్డి, మొగుళ్ల రాజిరెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న టీడబ్ల్యూయూకు బాహాటంగానే మద్దతు పలికింది. పార్టీ తరఫున ఎన్నికల ఇన్‌చార్జిగా మాజీ మేయర్ బొంతు రామ్మోహన్‌ను రంగంలోకి దించి విస్తృతంగా ప్రచారం నిర్వహించింది. అయినప్పటికీ వెలువడుతున్న ఫలితాలు అధికార పార్టీకి శరాఘాతంగా మారాయని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రభుత్వం అండగా నిలిచినా కార్మికులు మాత్రం సంప్రదాయ జేఏసీ పక్షానే మొగ్గు చూపినట్లు తేటతెల్లమవుతోంది. ఎన్నికల్లో ప్రతిపక్షబీఆర్ఎస్ పరిస్థితి కూడా ఆశాజనకంగా లేదు. బీఆర్ఎస్ మద్దతు ఉన్న టీఎంయూ కేవలం ఏడు డిపోలకే పరిమితమై మూడో స్థానానికి పడిపోయింది. ఉద్యమ సమయంలో కార్మికులందరినీ బీఆర్ఎస్ అనుబంధ కార్మిక సంఘంలో చేర్చినా కాలక్రమేణా కార్మికులు మళ్లీ తమ పాత సంఘాల వైపే వెళ్లడం గమనార్హం. వెలుపల సీపీఐ, కాంగ్రెస్ కూటమిగా ఉన్నప్పటికీ ఈ ఎన్నికల్లో మాత్రం రెండు పార్టీల అనుబంధ సంఘాలు విడివిడిగానే పోటీ చేశాయి.



# ఉద్యమకారుడి కుటుంబానికి కేటీఆర్ అండ

**మహబూబాబాద్, సిరి న్యూస్ అక్టోబర్ 10:**
తెలంగాణ ఉద్యమంలో మానుకోట సంఘటన నుంచి చురుకైన పాత్ర పోషించిన ఉద్యమకారుడు, దంతాలపల్లి మండలం పెద్దముప్పారం గ్రామానికి చెందిన ఈదురు జనార్ధన్ అనారోగ్యంతో ఇటీవల మరణించారు. పేదరికంతో ఇబ్బందులు పడుతూ కుటుంబ పోషణ కోసం రోజువారీ కూలీగా పనిచేసిన జనార్ధన్‌కు ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ఆయన మరణంతో కష్టాల్లో పడిన కుటుంబానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అండగా నిలిచారు. జనార్ధన్ కుటుంబ పరిస్థితిని తెలుసుకున్న కేటీఆర్ వెంటనే స్పందించి కుటుంబ సభ్యులతో ఫోన్‌లో మాట్లాడారు. వారిని పరామర్శించి ధైర్యం చెప్పారు. జనార్ధన్ ముగ్గురు కుమార్తెల భవిష్యత్తుకు భరోసా కల్పించేలా ఒక్కొక్కరి పేరిట రూ.3 లక్షల చొప్పున మొత్తం రూ.9 లక్షల ఫిక్స్‌డ్ డిపాజిట్లు అందించేలా చర్యలు తీసుకున్నారు. అదేవిధంగా జనార్ధన్ సతీమణి ఈదురు మల్లికకు కుటుంబ ఖర్చుల నిమిత్తం తక్షణ ఆర్థిక సహాయంగా రూ.లక్ష అందించారు. భవిష్యత్తులో ఆడబిడ్డలకు ఉద్యోగాల కల్పన విషయంలోనూ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కేటీఆర్ ఆదేశాల మేరకు మహబూబాబాద్ జిల్లా బీఆర్ఎస్ నాయకులు జనార్ధన్ నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. దివంగత ఉద్యమకారుడి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులతో ఆత్మీయంగా మాట్లాడి వారి యోగక్షేమాలను తెలుసుకున్నారు. కేటీఆర్ అందించిన ఆర్థిక సహాయాన్ని కుటుంబ సభ్యులకు అందజేసి వారికి ధైర్యం చెప్పారు. అనంతరం కుటుంబ సభ్యులతో కలిసి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మహబూబాబాద్ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎంపీ మాలోత్ కవిత, మాజీ మంత్రులు రెడ్యా నాయక్, సత్యవతి రాథోడ్, మాజీ జడ్పీ వైస్ చైర్మన్ వెంకటేశ్వరరెడ్డి తదితర పార్టీ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన ఉద్యమకారుల త్యాగాలను గుర్తుంచుకుంటూ, వారి కుటుంబాలు కష్టాల్లో ఉన్నప్పుడు అండగా నిలవడం బీఆర్ఎస్ పార్టీ నిబద్ధతకు నిదర్శనమని అన్నారు. జనార్ధన్ కుటుంబానికి అవసరమైన సమయంలో కేటీఆర్ స్పందించి ఆర్థిక సహాయం అందించడం ద్వారా ఆయన ముగ్గురు కుమార్తెల భవిష్యత్తుకు భరోసా కల్పించారని పేర్కొన్నారు.



# రెవెన్యూలో ప్రక్షాళనకు కసరత్తు !

**మొదటిపేజీ తరువాయి**
తమ సొంత భూముల క్రయవిక్రయాలు ఆగిపోవడంతో బాధితులు ఏళ్ల తరబడి రెవెన్యూ కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నారు. ఈ వ్యవహారం ప్రజల్లో తీవ్ర అసంతృప్తికి దారితీయడంతో పాటు రాజకీయంగానూ ప్రభుత్వ ప్రతిష్ఠకు భంగం కలిగిస్తోందన్న నిర్ధారణకు ప్రభుత్వం వచ్చినట్లు తెలుస్తోంది.

**స్పష్టమైన మార్గదర్శకాలు ఇచ్చినా కదలని ఫైళ్లు..**

అర్హత కలిగిన భూములను 22ఏ నిషేధిత జాబితా నుంచి తొలగించి రిజిస్ట్రేషన్లకు మార్గం సుగమం చేయాలని ప్రభుత్వం స్పష్టమైన మార్గదర్శకాలు, ఆదేశాలు జారీ చేసినప్పటికీ క్షేత్రస్థాయిలో ఫైళ్లు ముందుకు కదలడం లేదు. గతంలో ఆయా భూములను నిషేధిత జాబితాలో చేర్చిన అధికారులే ఇప్పటికీ కొనసాగుతుండటంతో, తమ తప్పులు బయటపడతాయన్న భయంతో ఫైళ్లను తొక్కిపెడుతున్నారనే ఫిర్యాదులు ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లాయి. ఉన్నతాధికారుల ఆదేశాలను సైతం బేఖాతరు చేస్తూ సామాన్యులను కార్యాలయాల చుట్టూ తిప్పుతున్న అధికారుల తీరుపై ప్రభుత్వం తీవ్ర అసహనం వ్యక్తం చేస్తోంది.

**కొత్త అధికారులతో సమస్యలకు శాశ్వత పరిష్కారం...**

ఏళ్ల తరబడి ఒకే ప్రాంతంలో తిష్టవేసిన అధికారులను బదిలీ చేసి, వారి స్థానంలో కొత్తవారిని నియమిస్తేనే భూ సమస్యల పరిష్కారంలో పురోగతి సాధ్యమవుతుందని ప్రభుత్వ వర్గాలు భావిస్తున్నాయి. పాత వివాదాలు, స్థానిక రాజకీయాలతో సంబంధం లేని కొత్త అధికారులు బాధ్యతలు చేపడితే పెండింగ్ దరఖాస్తులను నిష్పక్షపాతంగా, వేగంగా పరిశీలించే వీలుంటుందని అంచనా వేస్తున్నారు. ముఖ్యంగా 22ఏ సమస్యలను యుద్ధప్రాతిపదికన పరిష్కరించి ప్రజలకు ఊరట కల్పించాలంటే అధికారుల మార్పు ఒక్కటే సరైన మార్గమని ప్రభుత్వం భావిస్తోంది.

**అవినీతి ఆరోపణలపై ఇంటెలిజెన్స్ డేగకన్ను...**

రెవెన్యూ శాఖలో కొందరు అధికారులపై వెల్లువెత్తుతున్న అవినీతి ఆరోపణలు సైతం బదిలీల జాబితా రూపకల్పనలో కీలక పాత్ర పోషిస్తున్నాయి. నిషేధిత జాబితా నుంచి భూములను తొలగించడం, రికార్డుల సవరణ, వారసత్వ హక్కుల బదిలీల కోసం అడ్డగోలు వసూళ్లకు పాల్పడుతున్నారంటూ ప్రజల నుంచి నేరుగా ప్రభుత్వానికి, విజిలెన్స్‌కు ఫిర్యాదులు అందుతున్నాయి. పనితీరు సక్రమంగా లేని, అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారుల జాబితాను నిఘా వర్గాలు ఇప్పటికే ప్రభుత్వ పెద్దలకు సమర్పించినట్లు తెలుస్తోంది.

**నవంబర్‌లో బదిలీలు..**

ప్రస్తుతం జరుగుతున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియతో పాటు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు ప్రక్రియ నవంబర్ మొదటి వారంలో ముగియనుంది. నవంబర్ 9 తర్వాత ఎన్నికల నిబంధనల వెసులుబాటు లభించగానే రెవెన్యూ బదిలీల ఫైల్‌పై ప్రభుత్వం సంతకం చేసే అవకాశముంది. ఈ క్రమంలో దీర్ఘకాలంగా ఒకే చోట పనిచేస్తున్న అధికారులు, వివాదాస్పద తహశీల్దార్లు, ఆర్డీవోలు తమ సీట్లను కాపాడుకునేందుకు పైరవీలు మొదలుపెట్టగా, బదిలీల ప్రచారం రెవెన్యూ వర్గాల్లో తీవ్ర కలకలం రేపుతోంది.

# నువ్వింకా బతికే ఉన్నావా?

- తోటి మనిషి పట్ల ఇంత కర్కశత్వమా అంటూ ఫైర్
- తహశీల్దార్‌పై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలి
- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ఫిర్యాదు
- వెంటనే సస్పెండ్ చేయాలని ప్రజాసంఘాల డిమాండ్

**మొదటిపేజీ తరువాయి**
అయితే రైతును చూడగానే ఆ అధికారి కనికరం చూపాల్సింది పోయి.. 'నువ్వింకా బతికే ఉన్నావా? నీ కుటుంబం ఇంకా పురుగుల మందు తాగి చావలేదా?' అంటూ తీవ్రస్థాయిలో కించపరిచాడు. నా బాధ నవ్వు తెప్పిస్తోందా అంటే.. అవునన్న వెటకారం అధికారి మాటలకు తీవ్ర మనస్తాపానికి గురైన రైతు యేసు.. 'సార్, చావొక్కటే తక్కువైంది' అని దీనంగా బదులివ్వగా, తహశీల్దార్ స్వామి ఏమాత్రం చలించకుండా వెకిలి నవ్వులు నవ్వాడు. 'సార్, నా భూ సమస్యను పరిష్కరించమంటే నా బాధను చూసి మీకు నవ్వొస్తోందా?' అని ఆ రైతు కన్నీటిపర్యంతమై నిలదీయగా.. 'అవును, కచ్చితంగా నవ్వొస్తుంది.. ఏం చేసుకుంటావో చేసుకో' అంటూ నిర్లక్ష్యంగా సమాధానమిచ్చాడు. కార్యాలయంలో జరిగిన ఈ అమానవీయ దృశ్యాలను అక్కడున్న కొందరు వీడియో తీసి సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేయడంతో ఆ దృశ్యాలు కాస్తా దావానలంలా వైరల్ అయ్యాయి. ప్రజల సమస్యలు తీర్చాల్సిన కుర్చీలో కూర్చుని రైతును చావమని సూచించిన సదరు తహశీల్దార్ తీరుపై నెటిజన్లు, ప్రజాసంఘాలు నిప్పులు చెరుగుతున్నాయి.

**ఎమ్మార్వో తీరుపై భగ్గుమన్న కేటీఆర్..**

గజ్వేల్ తహశీల్దార్ స్వామి ప్రవర్తనపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. సమాజానికి అన్నం పెట్టే అన్నదాతల పట్ల ఇంతటి అమానవీయంగా వ్యవహరించడం ముమ్మాటికీ క్షమించరాని నేరమని ధ్వజమెత్తారు. తన జీవనాధారమైన వ్యవసాయ భూమిని కాపాడుకునేందుకు దరఖాస్తు చేసుకున్న రైతును ఆదుకోవాల్సింది పోయి, 'పురుగుల మందు తాగి చావలేదా' అంటూ వెటకారం చేయడం సిగ్గుచేటని, అత్యంత దారుణమని పేర్కొన్నారు. బాధలో ఉన్న తోటి మనిషిని చూసి ఎగతాళి చేయడమంటే ఆ అధికారి మానసికంగా ఎంతటి వికృత స్థితిలో ఉన్నారో స్పష్టమవుతోందని కేటీఆర్ మండిపడ్డారు. ఈ దారుణ ఘటనపై తక్షణమే విచారణ జరిపించి గజ్వేల్ తహశీల్దార్ స్వామిపై కఠినమైన క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని కేటీఆర్ డిమాండ్ చేశారు. రైతుల సంక్షేమం గురించి రోజూ గొప్పలు చెప్పుకునే ప్రభుత్వం, క్షేత్రస్థాయిలో అన్నదాతలకు జరుగుతున్న ఇలాంటి పరాభవాలకు నైతిక బాధ్యత వహించాలని స్పష్టం చేశారు. అధికారం నెత్తికెక్కి రైతుల ఆత్మగౌరవాన్ని మంటగలిపే అధికారులకు ప్రభుత్వం గట్టి గుణపాఠం చెప్పకపోతే ప్రజాగ్రహం తప్పదని హెచ్చరించారు. బాధిత రైతు యేసుకు తక్షణమే న్యాయం చేసి, వివాదాస్పద తహశీల్దార్‌ను ఉద్యోగం నుంచి తొలగించాలని రైతు సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

# సంక్షేమ పథకాలే కాంగ్రెస్ విజయానికి బలం

**మొదటిపేజీ తరువాయి**
నగరంలో జిల్లా శాఖ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో భారీ మెజారిటీ సాధించాలంటే పక్కా కార్యాచరణతో ముందుకు సాగాలన్నారు. జిల్లాస్థాయి సమావేశం అనంతరం ఐదు శాసనసభ నియోజకవర్గాల్లో సమావేశాలు నిర్వహించాలని, ఆ తర్వాత మండల, గ్రామస్థాయిల్లో సమావేశాలు ఏర్పాటు చేసి పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. ప్రతి శాసనసభ నియోజకవర్గానికి సీనియర్ నాయకుడిని ఇన్‌చార్జిగా నియమించి, వారి ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని కోరారు. గతంలో ఓటరుగా నమోదైన వారు సైతం ప్రస్తుత ఎన్నికల ప్రక్రియకు అనుగుణంగా మళ్లీ నమోదు చేసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. కాంగ్రెస్ కుటుంబాల్లోని పట్టభద్రులను గుర్తించి వారంతా ఓటర్లుగా నమోదయ్యేలా చూడాలన్నారు. అనంతరం తటస్థ ఓటర్లను, ప్రభుత్వ సంక్షేమ పథకాల పట్ల సానుకూలంగా ఉన్న ఇతర వర్గాల పట్టభద్రులను కలిసి పార్టీ అభ్యర్థికి మద్దతు కూడగట్టాలని సూచించారు.

**3.42 కోట్ల మందికి సన్న బియ్యం పంపిణీ**
ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఇంటింటికీ వివరించాలని భట్టి పిలుపునిచ్చారు. రాష్ట్రంలో దాదాపు కోటి 6 లక్షల కుటుంబాలకు చెందిన 3.42 కోట్ల మందికి ప్రతి నెలా ఒక్కొక్కరికి ఆరు కిలోల చొప్పున సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని, సుమారు 72 లక్షల మంది రైతులకు రైతు భరోసా అందించామని, సుమారు 30 లక్షల వ్యవసాయ పంపుసెట్లకు ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నామని చెప్పారు. గృహజ్యోతి పథకం కింద సుమారు 53 లక్షల మందికి నెలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, సామాజిక భద్రతలో భాగంగా 43 లక్షల మందికి చేయూత పింఛన్లు అందిస్తున్నట్లు, రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా రాష్ట్రంలోని కోటి 6 లక్షల కుటుంబాలకు ఒక్కో కుటుంబానికి రూ.10 లక్షల వరకు వైద్య చికిత్స పొందే అవకాశం కల్పిస్తున్నామని వివరించారు. చదువుకు ఆర్థిక ఇబ్బందులు ఉండొద్దనే ఉద్దేశంతో సుమారు 12.5 లక్షల మంది విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను నేరుగా వారి ఖాతాల్లో జమ చేసే విధానాన్ని అమలు చేస్తోందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో సుమారు 27 లక్షల మంది విద్యార్థులకు ఉదయం అల్పాహారంతోపాటు ఒక గ్లాసు పాలు అందించే కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టిందని చెప్పారు.

**కాంగ్రెస్‌కు అంకితమైన కుటుంబం నుంచి సర్వోత్తమ్ రెడ్డి**

రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి కుటుంబానికి కాంగ్రెస్‌తో సుదీర్ఘ అనుబంధం ఉందన్నారు. రాంరెడ్డి వెంకట్ రెడ్డి, దామోదర్ రెడ్డి వంటి నాయకుల కుటుంబం పార్టీకి అవసరమైన ప్రతి సందర్భంలో అండగా నిలిచిందన్నారు. కాంగ్రెస్ కోసం నిబద్ధతతో పనిచేసిన ఈ కుటుంబాన్ని పార్టీ ఎప్పటికీ మరిచిపోదని చెప్పారు. సర్వోత్తమ్ రెడ్డిని కేవలం ఒక అభ్యర్థిగా కాక పార్టీ ప్రతినిధిగా భావించి ఆయన విజయం కోసం ప్రతి నాయకుడు, కార్యకర్త బాధ్యత తీసుకోవాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్‌కు ఈ జిల్లా బలమైన పునాది ఉన్న ప్రాంతమని పేర్కొంటూ అదే ఐక్యతను పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో చాటాలని, సర్వోత్తమ్ రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, ఎమ్మెల్యేలు రాందాస్ నాయక్, మట్ట రాగమయి, కోరం కనకయ్యలు ప్రసంగించారు. సమావేశానికి డీసీసీ అధ్యక్షుడు నూతి సత్యనారాయణ అధ్యక్షత వహించగా గిడ్డంగుల సంస్థ మాజీ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, 'సుడా' చైర్మన్ పువ్వాళ్ళ దుర్గాప్రసాద్ తదితరులు హాజరయ్యారు.

**ఇందిరమ్మ ఇళ్లతో పేదల సొంతింటి కల సాకారం**

ఇల్లు లేని పేద కుటుంబాలకు సొంతింటి కలను సాకారం చేసేందుకు ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని పెద్ద ఎత్తున అమలు చేస్తున్నామని, తొలి దశలో 4.5 లక్షల ఇళ్లకు ఒక్కో ఇంటికి రూ.5 లక్షల చొప్పున ఆర్థిక సహాయం అందించే కార్యక్రమాన్ని చేపట్టామని తెలిపారు. రెండో దశలో మరో 2.5 లక్షల ఇళ్లను మంజూరు చేసే దిశగా ఒక్కో నియోజకవర్గానికి 2,000 ఇళ్ల చొప్పున ముందుకు సాగుతున్నామని వివరించారు. హైదరాబాద్‌లోనూ పేదలకు లక్ష ఇళ్ల నిర్మాణం చేపడుతున్నామని, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం కోసం ప్రభుత్వం రూ.40 వేల కోట్లT వెచ్చిస్తున్నదని చెప్పారు. ఇందిరమ్మ జయంతి సందర్భంగా నవంబర్ 19న ఇందిరమ్మ బీమా పథకాన్ని ప్రారంభించే దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు. కులం, మతం, ప్రాంత భేదాలు లేకుండా కుటుంబానికి ఆదాయాన్ని సమకూర్చే వ్యక్తి ప్రమాదవశాత్తు మరణిస్తే ఆ కుటుంబానికి రూ.5 లక్షల బీమా సాయం అందించేలా పథకాన్ని రూపొందిస్తున్నామని వివరించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల ద్వారా ప్రజలకు కలుగుతున్న ప్రయోజనాలను కరపత్రాల రూపంలో రూపొందించి ప్రతి ఇంటికీ అందించాలని భట్టి విక్రమార్క నాయకులకు సూచించారు.

# తెలంగాణలో బతుకమ్మ సంబురాలు ప్రారంభం



**హైదరాబాద్, సిరి న్యూస్ అక్టోబర్ 10:**
తెలంగాణలో బతుకమ్మ సంబురాలు ప్రారంభమయ్యాయి. ప్రకృతి ప్రసాదించిన రంగురంగుల పూలను పేర్చి మహిళలు బతుకమ్మలను అందంగా అలంకరించారు. సంప్రదాయ దుస్తులు ధరించి, బతుకమ్మల చుట్టూ చేరి పాటలు పాడుతూ ఆటపాటలతో సందడి చేశారు. తొలిరోజు ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలను రాష్ట్రవ్యాప్తంగా ఉత్సాహంగా నిర్వహించారు.

**బతుకునిచ్చే పండుగ**
తంగేడు, గునుగు, కట్ల, గుమ్మడి తదితర పూలతో బతుకమ్మలను పేర్చి పసుపు, కుంకుమలతో గౌరమ్మను ప్రతిష్ఠించి మహిళలు భక్తిశ్రద్ధలతో పూజిస్తారు. పెళ్లైన మహిళలు పుట్టింటికి చేరుకుని కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి ఈ పండుగను ఆనందంగా జరుపుకుంటారు.

**తొమ్మిది రోజుల వేడుకలు**
ఎంగిలిపూల బతుకమ్మతో మొదలయ్యే ఉత్సవాలు అటుకుల బతుకమ్మ, ముద్దపప్పు బతుకమ్మ, నానబియ్యం బతుకమ్మ, అట్ల బతుకమ్మ, అలిగిన బతుకమ్మ, వేపకాయల బతుకమ్మ, వెన్నముద్దల బతుకమ్మ మీదుగా కొనసాగుతాయి. చివరిరోజు సద్దుల బతుకమ్మను అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. ప్రతిరోజూ ప్రత్యేకంగా బతుకమ్మను పేర్చి గౌరీదేవికి సంప్రదాయ నైవేద్యాలు సమర్పిస్తారు.

**రాష్ట్రవ్యాప్తంగా సందడి**
హైదరాబాద్‌లోని రవీంద్రభారతి, శిల్పారామంతో పాటు వరంగల్, హనుమకొండ, సంగారెడ్డి, మెదక్, కరీంనగర్ తదితర ప్రాంతాల్లో మహిళలు, చిన్నారులు ఉత్సవాల్లో పాల్గొన్నారు. రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, చప్పట్లు కొడుతూ వాటి చుట్టూ తిరుగుతూ పాటలు పాడారు.

**ఆడబిడ్డల ఆత్మీయ వేడుక బతుకమ్మ పండుగ**

**హైదరాబాద్, అక్టోబర్ 10 :**
తెలంగాణ ఆడబిడ్డల అతిపెద్ద పండుగ, సింగిడి రంగుల పూల సంబరం బతుకమ్మ పండుగ ఎంగిలిపూల బతుకమ్మతో ప్రారంభమవుతున్న శుభ సందర్భంగా ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి 'ఎక్స'లో మహిళలందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. తెలంగాణ సాంస్కృతిక వైభవాన్ని చాటుతూ ప్రకృతి అందాలను పూలలో కొలువుదీర్చే ఈ పూల పండుగ ప్రతి ఇంటా ఆనందాలను, ప్రతి గుండెలో సంతోషాలను నింపాలని ఆకాంక్షించారు. గౌరమ్మ తల్లి ఆశీస్సులతో ఆడబిడ్డలందరూ ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ముఖ్యమంత్రి మనస్ఫూర్తిగా కోరుకున్నారు.

# ఎంఎస్ఎంఈల కోసం 'సెంటర్ ఆఫ్ ఎక్స్ లెన్స్'

- సమస్యల పరిష్కారానికి నెలకోసారి ఎంఎసఎంఈ గ్రీవెన్స్ డే
- నగరంలోని పారిశ్రామికవాడల అభివృద్ధికి చర్యలు
- ఎల్ యూబీ ఎంఎస్ఎంఈ సౌత్ ఇండియా సమ్మిట్‌లో మంత్రి శ్రీధర్‌బాబు

**హైదరాబాద్, సిరి న్యూస్ అక్టోబర్ 10 :**

రాష్ట్రంలోని సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల(ఎంఎస్ఎంఈ)ను మరింత బలోపేతం చేసేందుకు ప్రత్యేకంగా సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను ఏర్పాటు చేస్తామని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు వెల్లడించారు. ఈ కేంద్రం ద్వారా 'మేడ్ ఇన్ తెలంగాణ' బ్రాండ్ విశ్వవ్యాప్తమయ్యేలా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, మార్కెట్ అవకాశాలు, పెట్టుబడుల అనుసంధానం తదితర అంశాల్లో ఎంఎస్ఎంఈలకు మార్గ నిర్దేశం చేస్తామన్నారు. లఘు ఉద్యోగ్ భారతి(తెలంగాణ) ఆధ్వర్యంలో బంజారాహిల్స్‌లో శనివారం నిర్వహించిన ఎల్‌యూబీ ఎంఎస్ఎంఈ సౌత్ ఇండియా సమ్మిట్‌ను ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ ఎంఎసఎంఈలు లక్షలాది కుటుంబాలకు జీవనోపాధి కల్పిస్తూ పారిశ్రామికాభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తున్నాయన్నారు. రాష్ట్రంలో ఈ రంగం అభివృద్ధికి తమ ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. దేశంలోనే తొలిసారిగా ఎంఎసఎంఈ పాలసీని తీసుకొచ్చిన ఘనత తెలంగాణకే దక్కిందన్నారు. క్షేత్రస్థాయిలో ఎంఎసఎంఈలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటికి ఆచరణాత్మక పరిష్కారాలు చూపించేందుకు నెలకోసారి ప్రత్యేకంగా గ్రీవెన్స్ డే నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. హైదరాబాద్‌తోపాటు శివారు ప్రాంతాల్లోని పారిశ్రామికవాడల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. తెలంగాణ ఎంఎసఎంఈ ఉత్పత్తులను జాతీయ, అంతర్జాతీయ మార్కెట్లతో అనుసంధానం చేసేందుకు ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నామన్నారు. మారుతున్న మార్కెట్ అవసరాలకు అనుగుణంగా నాణ్యత, సాంకేతికత, నైపుణ్యాభివృద్ధి, ఉత్పత్తి సామర్థ్యం పెంపుపై ఎంఎసఎంఈలు దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ ఎండీ రామ్మోహన్ రావు, లఘు ఉద్యోగ్ భారతి ప్రతినిధులు వై.వెంకటేశ్వర్లు, కె.నరేంద్రనాథ్ దత్, ఓం అనూజ్ ఖదేల్వాల్ తదితరులు పాల్గొన్నారు.

# పరస్పర గౌరవంతోనే ఆరోగ్యకర బంధాలు

- కోపం, అహంకారాన్ని విడనాడాలి
- 'స్టాండ్ విత్ హర్' చర్చావేదికలో డీజీ చారు సిన్హా

**హైదరాబాద్, సిరి న్యూస్ అక్టోబరు 10:**

కోపం, అహంకారం, ఆధిపత్య ధోరణులతో కూడిన విషపూరిత పురుషాధిక్య భావజాలాన్ని మార్చుకోవాలని సీఐడీ, ఏసీబీ, మహిళా భద్రత విభాగాల డీజీ చారు సిన్హా అన్నారు. పురుషులు అలవర్చుకున్న ప్రవర్తనలను మార్చుకోవడం కూడా సాధ్యమేనని పేర్కొన్నారు. పురుషులు, మహిళలు ఒకరికొకరు పరస్పర పూరకాలని, ఎవరూ ఎక్కువ లేదా తక్కువ కాదని స్పష్టం చేశారు. 'స్టాండ్ విత్ హర్' ప్రచారంలో భాగంగా శనివారం హైదరాబాద్‌లోని వీహబ్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో నిర్వహించిన ఎనిమిదో చర్చావేదికలో ఆమె మాట్లాడారు.



**భావోద్వేగాలను నియంత్రించుకోవాలి**

వాదన జరిగినప్పుడు భావోద్వేగాలను అదుపులోకి తెచ్చుకునేందుకు కొంత సమయం తీసుకోవడం మంచిదేనని అనూష సూచించారు. అయితే, తనకు కొంత సమయం అవసరమని ఎదుటివారికి తెలియజేయకపోతే అపార్థాలు ఏర్పడతాయని చెప్పారు. కుటుంబం, సమాజంలో లింగ వివక్షకు సంబంధించిన పాత భావజాలాన్ని పురుషులతోపాటు మహిళలు కూడా కొనసాగిస్తున్నారని నటి, యాంకర్ ఝాన్సీ పేర్కొన్నారు. ఇలాంటి ధోరణులను ప్రతి ఒక్కరూ గుర్తించి మార్చుకోవాలని సూచించారు.

**క్రీడలతో ఒత్తిడికి దూరం**

కోపాన్ని నిర్మాణాత్మకంగా మళ్లించేందుకు క్రీడలు, శారీరక వ్యాయామాలు దోహదపడతాయని నటుడు వంశీ చాగంటి అన్నారు. విభేదాలు వచ్చినప్పుడు వాదనలో గెలవడం కంటే సంబంధాలను కాపాడుకోవడం ముఖ్యమని కార్మిక శాఖ ప్రత్యేక కమిషనర్ పమేలా సత్పతి అన్నారు. మహిళల అభిప్రాయాలు, అనుభవాలను తక్కువగా చూడటం, వారికి తెలిసిన విషయాలను అనవసరంగా వివరించడం వంటి ధోరణులను గుర్తించి మార్చుకోవాలని వీహబ్ సీఈఓ సీత పల్లచొల్ల సూచించారు.

**సమానత్వమే లక్ష్యం**

కోపం, అహంకారం, వివక్షాపూరిత ధోరణులను అధిగమించేందుకు పరస్పర చర్చించుకోవడం, ఇతరుల అభిప్రాయాలకు గౌరవం, స్వీయ నియంత్రణ అవసరమని వక్తలు పేర్కొన్నారు. 'స్టాండ్ విత్ హర్' కార్యక్రమం ద్వారా ప్రతి నెలా ఒక అంశంపై చర్చలు నిర్వహిస్తూ లింగ సమానత్వం, పరస్పర గౌరవం, సామాజిక మార్పుపై అవగాహన కల్పిస్తున్నారు. ఈ చర్చలో సీడీఈడబ్ల్యూ, మహిళా భద్రత విభాగానికి చెందిన అనూష, నటి ఝాన్సీ, నటుడు వంశీ చాగంటి, వీహబ్ సీఈఓ సీత పల్లచొల్ల, ఐఏఎస్ అధికారి పమేలా సత్పతి, టీవీ9 సీనియర్ వార్తా వ్యాఖ్యాత దీప్తి వాజ్‌పేయి, పోలీస్ అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ఫలక్ నుమా కాళీ మాత ఆలయంలో వసతులు కల్పించాలి

- తెలంగాణ రక్షణ సేన చీఫ్ కవిత

**హైదరాబాద్, సిరి న్యూస్ అక్టోబర్ 10:**

పాతబస్తీలోని ఫలక్ నుమా కాళీ మాత ఆలయంలో భక్తులకు కనీస సౌకర్యాలు లేక ఇబ్బంది పడుతున్నారని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత ఆవేదన వ్యక్తం చేశారు. నిత్యం వేలాదిగా భక్తులు వచ్చే ఆలయంలో కనీస సౌకర్యాలు కల్పించకపోవటం విచారకరమన్నారు. కాళీ మాత మందిరాన్ని శుక్రవారం సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆమెమీడియాతో మాట్లాడారు. పాత బస్తీలోని కాళి మాత ఆలయమంటే హైదరాబాద్ ప్రజలకు ఎంతో నమ్మకమని, భక్తులకు కొంగు బంగారమని చెప్పారు. అలాంటి ఆలయంలో భక్తులకు కనీస సౌకర్యాలు లేవని, సరైన రోడ్డు మార్గం లేదని, మహిళలకు వాష్ రూమ్ లు కూడా లేని పరిస్థితి ఉందన్నారు. చుట్టూ రైల్వే స్థలాలు, పక్కనే శ్మశానం ఉండటంతో రోడ్డు వేసే పరిస్థితి కూడా లేదన్నారు. ఎండోమెంట్ డిపార్ట్ మెంట్, అదేవిధంగా రైల్వే అధికారులతో మాట్లాడి ఇక్కడ రోడ్లు వేసేలా, ఆలయంలో వసతులు కల్పించే విధంగా తన వంతు ప్రయత్నం చేస్తానని చెప్పారు. స్థానిక ఎమ్మెల్యే కూడా ఈ విషయంలో చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు.

**బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు**

బతుకమ్మ పండుగ ప్రారంభమైన సందర్భంగా రాష్ట్ర ప్రజందరికీ కవిత బతుకమ్మ శుభాకాంక్షలు తెలుపుతూ 'ఎక్స్ 'లో ట్వీట్ చేశారు. తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక అయిన బతుకమ్మ పండుగను తెలంగాణ ఆడబిడ్డందరూ సంతోషంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. బతుకమ్మ పండుగ తెలంగాణ



ఆత్మగౌరవ ప్రతీక అన్నారు. నాడు రాష్ట్ర సాధనకు బతుకమ్మను సాంస్కృతిక వారధిగా మలుచుకున్న మనమంతా ఇప్పుడు సకల జనుల వికాసం, బహుజన తెలంగాణ సాధన కోసం బతుకమ్మలో గౌరమ్మలా ఒదిగి కలిసి పనిచేద్దామన్నారు.

# కాంగ్రెస్ దుష్ప్రచారాన్ని తిప్పికొట్టండి

- వరుస ఓటములతో భయపడిన రాహుల్
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు

**హైదరాబాద్, సిరి న్యూస్ అక్టోబర్ 10 :**

రాష్ట్రంలో ఇటీవల పూర్తయిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(ఎస్ఐఆర్) ప్రక్రియపై కాంగ్రెస్ చేస్తున్న అసత్య ఆరోపణలను క్షేత్రస్థాయిలో బలంగా తిప్పికొట్టాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్ రావు పిలుపునిచ్చారు. పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఆల్ సెల్స్ కన్వీనర్లు, ముఖ్య నాయకులు, రాష్ట్ర అధికార ప్రతినిధులు, మీడియా ప్యానలిస్టులతో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ఎన్నికల సంఘం సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగా బోగస్ ఓట్లను తొలగించి పారదర్శకంగా జాబితాను రూపొందిస్తే వరుస ఎన్నికల ఓటములతో భయపడిన రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి రాజ్యాంగ సంస్థలపై బురదజల్లుతున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ ఓట్ చోరీ నాటకాలను ఎండగడుతూ స్వచ్ఛమైన ఓటర్ల జాబితా వల్ల ప్రజాస్వామ్యానికి చేకూరే ప్రయోజనాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ పచ్చి అబద్ధాలతో ప్రజలను తప్పుదోవ పట్టించే కుట్ర చేస్తోందన్నారు. ఎసఐఆర్‌పై వీళ్లు సాగిస్తున్న దుష్ప్రచారానికి హద్దు, అదుపు లేకుండా పోయిందని మండిపడ్డారు. నిన్న కాంగ్రెస్ ప్రతినిధి బృందం రాష్ట్రపతిని కలిసిన తర్వాత రాహుల్ గాంధీ మీడియా ముందు ఇంకో కొత్త నాటకానికి తెరలేపారని, తాము చెప్పిన ఆరోపణలకు రాష్ట్రపతి ఆధారాలు అడిగారని చెప్పారని, చేతిలో ఒక్క ఆధారం కూడా లేకపోయినా చివరకు రాష్ట్రపతి ఓటు చోరీని ఒప్పుకున్నారంటూ ప్రచారం మొదలుపెట్టారని విమర్శించారు. ఆధారాలు చూపించలేక అబద్ధాలను అంటగట్టడం కాంగ్రెస్ దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమన్నారు. సెకండ్ ఫేజ్ ఎస్ఐఆర్ అనేది 45 నెలలపాటు సాగే సుదీర్ఘమైన ప్రక్రియ. మొదట బూత్ లెవల్ అధికారులు స్వయంగా ప్రతి ఇంటికీ వెళ్లి వివరాలు పరిశీలించి చనిపోయిన, వలస వెళ్లినవారి పేర్లను తనిఖీ చేసిన తర్వాతే ముసాయిదా లిస్ట్ ఇస్తారన్నారు. ఆ తర్వాత సమ్మరీ లిస్టుపై ఎవరికైనా అభ్యంతరాలుంటే టైప్, ప్రింట్ లేదా చేత్తో రాసి కూడా ఫారమ్7 అందజేయవచ్చు. దీనిపై ఈఆర్‌వో స్థాయి అధికారి పూర్తి విచారణ చేస్తారు.. అన్ని పార్టీల బీఎల్ఏలకు నోటీసులు ఇచ్చిన తర్వాతే పేర్ల తొలగింపులు జరుగుతాయి అని తెలిపారు. ఒకవేళ తొలగింపు తర్వాత కూడా ఎవరైనా



అభ్యంతరం వ్యక్తం చేసి క్లెయిమ్ చేసుకుంటే మళ్లీ పేరును చేర్చడానికి కూడా స్పష్టమైన పద్ధతి ఉందన్నారు. ఇంత పకడ్బందీగా జరిగే ఎసఐఆర్‌లో ఏకపక్షంగా పేరు తొలగింపు ఉండదన్నారు. ఒక్కరైనా ముందుకొచ్చి తమ పేరు డిలీట్ అయిందని చూపించారా అని ప్రశ్నించారు. ఏ ఆధారం లేనప్పుడు అసలు ఓట్ చోరీ ఎక్కడ జరిగినట్లు.. కాంగ్రెస్ పార్టీ సమాధానం చెప్పాలి అని రామచందర్‌రావు డిమాండ్ చేశారు.

# దేశ ప్రగతికి ఎంఎస్ఎంఈలే ప్రధాన చోదక శక్తులు

**మొదటిపేజీ తరువాయి**

దేశ అభివృద్ధి వేగవంతమవుతుందని స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో శనివారం నిర్వహించిన 'లఘు ఉద్యోగ్ భారతి - సౌత్ ఇండియా కాంక్లేవ్'లో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. ఎంఎస్ఎంఈలు దేశ ఆర్థిక వ్యవస్థలో అత్యంత కీలక పాత్ర పోషిస్తున్నాయని, దేశ జీడీపీలో 32%, తయారీ రంగ ఉత్పత్తిలో 36%, ఎగుమతుల్లో 49% వాటా కలిగి ఉన్నాయని వెల్లడించారు. 'ఉద్యమ' ప్లాట్‌ఫాంపై దాదాపు 9.80 కోట్ల ఎంఎస్ఎంఈలు నమోదయ్యాయని, ఇవి 40 కోట్లకుపైగా ప్రజలకు ఉపాధి కల్పిస్తున్నాయని చెప్పారు. ఇందులో 37% సంస్థలు మహిళల యాజమాన్యంలో నడవడం విశేషమన్నారు.

**కేంద్ర ప్రభుత్వ తోడ్పాటు**

ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఎంఎస్ఎంఈల ఎదుగుదలకు అనుకూలమైన వాతావరణాన్ని కల్పించిందన్నారు. స్టార్టప్‌లకు త్వరితగతిన అనుమతులు ఇవ్వడం, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్, క్రెడిట్ గ్యారంటీ ఫండ్, పీఎం విశ్వకర్మ, ముద్ర, గవర్నమెంట్ ఇమార్కెట్ ప్లేస్(జీఈఎం) వంటి అనేక పథకాల ద్వారా ఆర్థిక సాయం, రుణ సదుపాయాలను అందిస్తున్నట్లు వివరించారు. ఎంఎస్ఎంఈలకు అవసరమైన ఫైనాన్స్ అందించేందుకు బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

**ఉత్పత్తి రంగానికి దక్షిణ భారత్ హబ్**

దక్షిణ భారతదేశం ఆటోమొబైల్, ఫార్మా, టెక్స్‌టైల్స్, ఎలక్ట్రానిక్స్, ఏరోస్పేస్, డిఫెన్స్ రంగాలు, సాంకేతిక ఆవిష్కరణలకు ప్రధాన కేంద్రంగా మారిందని కొనియాడారు. ప్రస్తుతం భారత్ ప్రపంచంలోనే ప్రముఖ సెల్ ఫోన్ తయారీ కేంద్రంగా మారిందని, ఐఫోన్లు కూడా ఇక్కడే ఉత్పత్తి అవుతున్నాయని కిషన్‌రెడ్డి గుర్తు చేశారు.

**ప్రతిపక్షాలపై ధ్వజం**

ప్రపంచమంతా భారత ఆర్థిక వ్యవస్థను పొగుడుతుంటే, కొందరు ప్రతిపక్ష నేతలు విదేశీ వేదికలపై ఇండియన్ ఎకానమీ డెడ్ అని మాట్లాడుతూ దేశ పరువు తీస్తున్నారని మండిపడ్డారు. రాజకీయ స్వార్థం కోసం పెట్టుబడులను, యువత ఉపాధి అవకాశాలను పణంగా పెట్టవద్దని హితవు పలికారు. 2014 ముందు నాటి పరిస్థితులతో పోలిస్తే ప్రస్తుతం దేశంలో విద్యుత్ కోతలు లేవని, విమానాశ్రయాలు, మెడికల్ కాలేజీలు, ఉత్పాదక రంగం భారీగా విస్తరించాయని ఆయన స్పష్టం చేశారు.

# సృజనాత్మక ఆలోచనలకు ప్రోత్సాహం

- ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల

**హైదరాబాద్, సిరి న్యూస్ అక్టోబర్ 10 :**

సమాజానికి ఉపయోగపడే సృజనాత్మక ఆలోచనలతో ముందుకొచ్చే ప్రతి ఒక్కరినీ తమ ప్రభుత్వం ఎల్లప్పుడూ ప్రోత్సహిస్తుందని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు స్పష్టం చేశారు. 'కీర్తన అకాడమీ ఆఫ్ మ్యూజిక', ప్రముఖ నేపథ్య గాయకుడు నేమాని పార్థు ఆధ్వర్యంలో రూపొందించిన 'భాగవతామృతం' (దృశ్యశ్రవణ పద్యకథా మాలిక) మొదటి సంచికను బంజారాహిల్స్‌లోని ప్రసాద్ ల్యాబ్స్‌లో శనివారం ఆయన లాంఛనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ టెక్నాలజీ అభివృద్ధి చెందుతున్నకొద్దీ సమాజంలో నైతిక విలువలు, సంస్కృతి, సంప్రదాయాలు, పురాణాలు, ఇతిహాసాలపై అవగాహన తగ్గుతోందన్నారు. ఇలాంటి తరుణంలో మన ఆధ్యాత్మిక, సాంస్కృతిక వారసత్వాన్ని నేటి తరానికి అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. భాగవతంలోని పద్యాలు, వాటి అంతరార్థాన్ని పిల్లలు, యువతకు సులభంగా అర్థమయ్యేలా ఆహ్లాదకరమైన సంగీతం, ఆకట్టుకునే దృశ్యరూపకంతో 'భాగవతామృతం' పేరిట అందుబాటులోకి తీసుకురావడం ఎంతో అభినందనీయమన్నారు. విజ్ఞానంతోపాటు విలువలనూ పెంపొందించే ఇలాంటి తరహా సృజనాత్మక ప్రయోగాలు మరిన్ని రావాలని ఆకాంక్షించారు. భాగవతాన్ని ప్రతి ఇంట్లో వినపడేలా చేసేందుకు కృషి చేసిన కీర్తన అకాడమీ ఆఫ్ మ్యూజిక్ నిర్వాహకులను, గాయకుడు నేమాని పార్థును మంత్రి శ్రీధర్‌బాబు ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో గనుల శాఖ ప్రత్యేక అధికారి బీఆర్వీ సుశీల్ కుమార్, భోగరాజు మూర్తి, పార్థు నేమాని తదితరులు పాల్గొన్నారు.

# క్రీడల ప్రోత్సాహానికి ప్రత్యేక ప్రాధాన్యం

- ప్రపంచస్థాయి క్రీడా మౌలిక సదుపాయాల కల్పనకు కృషి
- కొరియా తరహాలో క్రీడాకారులను తీర్చిదిద్దే దిశగా అడుగులు
- ఐజీపీఎల్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి

**హైదరాబాద్, సిరి న్యూస్ అక్టోబర్ 10 :**



రాష్ట్రంలో క్రీడల అభివృద్ధికి, క్రీడాకారులను ప్రోత్సహించడానికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన క్రీడా మౌలిక సదుపాయాల కల్పనతోపాటు యువ క్రీడాకారులకు మెరుగైన శిక్షణ, ప్రోత్సాహకాలు అందించే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. హైదరాబాద్‌లో ప్రపంచస్థాయి స్పోర్ట్స్ స్టేడియాన్ని నిర్మించనున్నట్లు ముఖ్యమంత్రి ప్రకటించారని గుర్తు చేశారు. హైదరాబాద్ గోల్ఫ్ అసోసియేషన్, ఎన్‌డీటీవీ, ఏఎం గ్రీన్, ఇండియన్ గోల్ఫ్ ప్రీమియర్ లీగ్ (ఐజీపీఎల్) సంయుక్త ఆధ్వర్యంలో గోల్కొండ కోట సమీపంలోని గోల్ఫ్ కోర్స్‌లో నిర్వహించిన ఇండియన్ గోల్ఫ్ ప్రీమియర్ లీగ్ టోర్నమెంట్ శనివారంనాటి ముగింపు కార్యక్రమానికి ఆర్ అండ్ బి శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డితో కలిసి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ రాష్ట్రంలో క్రీడా రంగాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ప్రపంచ ప్రఖ్యాత ఫుట్‌బాల్ క్రీడాకారుడు మెస్సీని తెలంగాణకు ముఖ్యమంత్రి ఆహ్వానించారని, మెస్సీ ఫుట్‌బాల్ ఆడటంతోపాటు హైదరాబాద్‌లో ప్రపంచస్థాయి స్పోర్ట్స్ స్టేడియం నిర్మాణానికి సంబంధించిన ప్రకటన కూడా వెలువడిందని గుర్తు చేశారు. దక్షిణ కొరియా వంటి దేశాల్లోని విశ్వవిద్యాలయాలు క్రీడల్లో వందలాది పతకాలు సాధిస్తున్న తీరును పరిశీలించాలని ఈ సందర్భంగా సీఎం సూచించారని తెలిపారు. ఒకే విశ్వవిద్యాలయం వంద పతకాలు సాధించడం వెనుక ఉన్న శిక్షణా విధానాలు, క్రీడాకారులకు కల్పిస్తున్న సౌకర్యాలు, ప్రోత్సాహకాలను అధ్యయనం చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారన్నారు. ఈ క్రమంలో ముఖ్యమంత్రి దక్షిణ కొరియాలోని ఆ విశ్వవిద్యాలయాన్ని సందర్శించి వైస్ ఛాన్సలర్‌తోపాటు క్రీడా అధికారులతో చర్చలు జరిపారని తెలిపారు. తెలంగాణ విద్యార్థులకు క్రీడా శిక్షణ అందించేందుకు ఆ విశ్వవిద్యాలయంతో ఎంఓయూ కుదుర్చుకోవాలని కోరినట్లు తెలిపారు. హైదరాబాద్ గోల్ఫ్ కోర్సుకు ప్రత్యేక గుర్తింపు ఉందని, గోల్కొండ కోట వంటి చారిత్రక ప్రాంతానికి సమీపంలో నిర్వహిస్తున్న ఈ టోర్నమెంట్ నిర్వహించడం నగరానికి మరింత ప్రాచుర్యం తీసుకొస్తుందని పేర్కొన్నారు. ప్రభుత్వ భాగస్వామ్యంతో కొనసాగుతున్న గోల్ఫ్ కోర్సును క్రీడలు, పర్యాటక రంగాల అభివృద్ధికి ఉపయోగపడే ముఖ్యమైన ప్రాజెక్టుగా అభివర్ణించారు. క్రీడా మౌలిక సదుపాయాల అభివృద్ధితోపాటు పర్యాటక రంగానికి కూడా ప్రోత్సాహం అందిస్తామని చెప్పారు.

**విజేతలకు అభినందనలు**

ఐజీపీఎల్ టోర్నమెంట్‌లో పతకాలు, విజయాలు సాధించిన క్రీడాకారులను భట్టి విక్రమార్క ప్రత్యేకంగా అభినందించారు. ప్రపంచంలోని వివిధ ప్రాంతాల నుంచి ఈ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యత్తులో వారు మరిన్ని విజయాలు సాధించి తమ ప్రతిభతో దేశానికి, రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమానికి హాజరుకావాలని ఎన్‌డీటీవీ ప్రతినిధులు, తన మిత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఫహీమ్ ఖురేషి, భాస్కర్ రెడ్డిలు ప్రత్యేకంగా ఆహ్వానించారని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. ఖమ్మం నుంచి హైదరాబాద్‌కు రావడానికి ఐదు నుంచి ఐదున్నర గంటల సమయం పడుతుందని, అయినప్పటికీ ఈ కార్యక్రమ ప్రాధాన్యాన్ని గుర్తించి తన ఇతర కార్యక్రమాలను రద్దు చేసుకుని వచ్చానని చెప్పారు. క్రీడాకారులను ప్రోత్సహించే ఇలాంటి కార్యక్రమాలు మరిన్ని జరగాలని ఆకాంక్షించారు. అనంతరం విజేతలకు ట్రోఫీలను ఉప ముఖ్యమంత్రి భట్టి అందజేశారు.

# సౌత్ ఆఫ్రికాలో బతుకమ్మ ఆడిన మంత్రి సీతక్క

**హైదరాబాద్, సిరి న్యూస్ అక్టోబర్ 10 :**

దక్షిణాఫ్రికాలో సౌత్ ఆఫ్రికా తెలంగాణ అసోసియేషన్ ఆధ్వర్యంలో జోహాన్నెస్‌బర్గ్ నగరంలో శనివారం నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి దనసరి అనసూయ సీతక్క పాల్గొన్నారు. ఈ సందర్భంగా అక్కడ నివసిస్తున్న తెలంగాణ ఆడబిడ్డలతో కలిసి ఆమె బతుకమ్మ ఆడి, పాడారు. సంప్రదాయ బతుకమ్మ పాటలు, ఆటలతో సందడి చేశారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను విదేశీ గడ్డపై సైతం ఘనంగా చాటుతున్న ప్రవాస తెలంగాణ మహిళలతో కలిసి మంత్రి సీతక్క బతుకమ్మ సంబరాల్లో పాలుపంచుకున్నారు. తెలంగాణ ఆడబిడ్డల ఆత్మీయత, ఉత్సాహం మధ్య ఈ వేడుకలు కొనసాగాయి. పూలతో బతుకమ్మలను అందంగా అలంకరించి, సంప్రదాయ దుస్తుల్లో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని బతుకమ్మ పాటలు పాడుతూ సంబరాలు జరుపుకున్నారు. తెలంగాణ సంస్కృతికి ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను దేశ సరిహద్దులు దాటి విదేశాల్లోనూ ఘనంగా నిర్వహించడం పట్ల మంత్రి సీతక్క సంతోషం వ్యక్తం చేశారు.

## ఢిల్లీ నిరసనలపై సుప్రీంకోర్టులో నేడు విచారణ

- సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామాకు సీజేపీ డిమాండ్
- నిరసనలకు పిలుపుతో ఢిల్లీలో ఆంక్షలు.. పలువురు నేతలు, కార్యకర్తల నిర్బంధం
- పోలీసులపై కోర్టు ధిక్కరణ పిటిషన్..
- విచారణకు స్వీకరించనున్న ధర్మాసనం
- • నలుగురు మాజీ సీఎంల నిర్బంధంపైనా హెబియస్ కార్పస్ పిటిషన్

**న్యూఢిల్లీ, అక్టోబర్ 10,**

ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) శనివారం ఢిల్లీలో భారీ నిరసనకు పిలుపునిచ్చింది. దీంతో నగరంలో పోలీసులు ఆంక్షలు విధించి పలువురు పార్టీ నేతలు, నిరసనకారులను అదుపులోకి తీసుకున్నారు. సీజేపీ నేతలు అభిజిత్ దీప్కే, అశుతోష్ రాంకా, సౌరవ్ దాస్‌లను విమానంలో అదుపులోకి తీసుకుని రహస్య ప్రాంతానికి తరలించినట్లు కథనం పేర్కొంది.

**నిర్బంధాలపై సుప్రీంకోర్టులో పిటిషన్లు**

ఢిల్లీలో నిరసనల సందర్భంగా విధించిన ఆంక్షలు, ప్రతిపక్ష నేతలు, కార్యకర్తల నిర్బంధాలపై దాఖలైన పిటిషన్లను సుప్రీంకోర్టు ఆదివారం, అక్టోబర్ 11న విచారించనుంది. అక్టోబర్ 9న ఇచ్చిన ఆదేశాలను పోలీసులు ఉద్దేశపూర్వకంగా ఉల్లంఘించారంటూ న్యాయవాది శైలేంద్ర మణి త్రిపాఠి కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేశారు. కేంద్ర హోంశాఖ కార్యదర్శి గోవింద్ మోహన్, ఢిల్లీ పోలీస్ కమిషనర్ అనురాగ్ కుమార్, ఢిల్లీ మెట్రో రైల్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ డి. థారాపై చర్యలు తీసుకోవాలని అందులో కోరారు.

సుప్రీంకోర్టు ఆదేశాలు ఉన్నప్పటికీ మెట్రో స్టేషన్ల మూసివేత, రైళ్ల రద్దు కొనసాగించారని పిటిషనర్ ఆరోపించారు. ఈ పిటిషన్‌తో పాటు నిరసనకారుల నిర్బంధాన్ని సవాల్ చేస్తూ దాఖలైన హెబియస్ కార్పస్ పిటిషన్లను కూడా ధర్మాసనం విచారించనుంది. జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చి, జస్టిస్ వి. మెహానాలతో కూడిన ధర్మాసనం ఈ కేసులను పరిశీలించనుంది.

**నలుగురు మాజీ సీఎంల నిర్బంధంపై అభ్యంతరం**

నిరసనల సమయంలో ప్రతిపక్ష నేతలు, కార్యకర్తలను ముందస్తుగా నిర్బంధించడాన్ని సవాల్ చేస్తూ తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ, సీనియర్ న్యాయవాది మేనకా గురుస్వామి హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేశారు. నలుగురు మాజీ ముఖ్యమంత్రులను కూడా నిర్బంధించినట్లు పిటిషన్‌లో పేర్కొన్నారు. శాంతియుతంగా నిరసన తెలిపే ప్రాథమిక హక్కును అణచివేసేందుకు ముందస్తు నిర్బంధాన్ని ఉపయోగించకూడదని ఆమె వాదించారు.

**9న సుప్రీంకోర్టు ఏం చెప్పింది?**

ఢిల్లీలో ఆంక్షలపై అక్టోబర్ 9న విచారణ చేపట్టిన సుప్రీంకోర్టు, 57 మెట్రో స్టేషన్ల మూసివేతతో పాటు ఢిల్లీకి వచ్చే రైళ్ల రద్దుపై వచ్చిన వాదనలను పరిశీలించింది. ప్రజలకు రవాణా సదుపాయాలు పూర్తిగా అందకుండా ఆంక్షలు విధించరాదని స్పష్టం చేసినట్లు కథనం పేర్కొంది. భద్రతా పరిస్థితులను బట్టి మెట్రో, రైల్వే సేవలను నియంత్రించవచ్చని, అయితే వాటిని పూర్తిగా నిలిపివేయకూడదని సూచించినట్లు తెలిపింది.

## సీఈసీ రాజీనామా చేసే వరకు ఉద్యమం ఆగదు

- జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని సీజేపీ డిమాండ్
- ఎస్ఐఆర్ ప్రక్రియను ఉపసంహరించుకోవాలని పట్టుబాటు
- ముగ్గురు కీలక నేతల అరెస్టుతో ఉద్యమ బాధ్యతలు చేపట్టిన అజింక్య షిండే
- ఆదివారం కూడా ఢిల్లీలో నిరసనలు జరిగే అవకాశం..
- కొనసాగనున్న భద్రత

**న్యూఢిల్లీ, అక్టోబర్ 10,**

ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేసే వరకు తమ ఉద్యమాన్ని కొనసాగిస్తామని కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) స్పష్టం చేసింది. శనివారం ఢిల్లీలో పోలీసులు విధించిన ఆంక్షల నేపథ్యంలో పార్టీ నేతలు అభిజిత్ దీప్కే, సౌరవ్ దాస్, అశుతోష్ రాంకాలను అరెస్టు చేయడంతో ఉద్యమ బాధ్యతలను అజింక్య షిండే చేపట్టారు. జ్ఞానేశ్ కుమార్ పదవి నుంచి వైదొలిగే వరకు నిరసనలు ఆపబోమని ఆయన విలేకరులకు తెలిపారు. ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ (ఎస్ఐఆర్)ను ఉపసంహరించుకోవాలని సీజేపీ డిమాండ్ చేస్తోంది.

ఆదివారం కూడా నిరసనలకు అవకాశం

ఢిల్లీలోని జంతర్ మంతర్ పరిసరాల్లో ఆదివారం కూడా నిరసనలు జరిగే అవకాశం ఉందని పోలీసులు అంచనా వేస్తున్నారు. సీజేపీతో పాటు వామపక్ష విద్యార్థి సంఘాలు కూడా ఆందోళనలకు పిలుపునివ్వడంతో భద్రతను కొనసాగించనున్నట్లు పోలీసు వర్గాలు వెల్లడించాయి. శనివారం నిరసనల్లో పాల్గొనేందుకు వచ్చిన 2,000 మందికి పైగా ఆందోళనకారులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పరిస్థితులను బట్టి నిరసన ప్రాంతాల్లో భద్రతా చర్యలను కొనసాగించేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు.

## విమానంలో సీజేపీ నేతలకు అవమానం..



- తోటి ప్రయాణికుల నుంచి వ్యతిరేకత!
- సోషల్ మీడియా వీడియో షేర్ చేసిన బీజేపీ ఎంపీ
- ''పౌరుల ద్వారానే చెత్త నియంత్రణ'' అంటూ కామెంట్

**న్యూఢిల్లీ, అక్టోబర్ 10:**

ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాని డిమాండ్ చేస్తూ కాక్రోచ్ జనతా పార్టీ ఢిల్లీలో అక్టోబర్ 10 శనివారం భారీ నిరసనకు పిలుపునిచ్చింది. అయితే, ఢిల్లీ పోలీసులు కట్టుదిట్టమైన చర్యలతో సీజేపీ ప్రయత్నాలను వమ్ము చేశారు. ముంబై నుంచి ఢిల్లీకి విమానంలో వచ్చిన సీజేపీ నేతలు అభిజిత్ దీప్కే, అశుతోష్ రాంకా, సౌరవ్ దాస్‌లను విమానంలోనే అరెస్ట్ చేసి, రహస్య ప్రాంతానికి తరలించారు. ఇదిలా ఉంటే, విమానంలో పోలీసులు అదుపులోకి తీసుకునే సమయంలో హైడ్రామా నెలకొంది. తోటి ప్రయాణికుల నుంచి సీజేపీ నాయకులు తీవ్ర వ్యతిరేకతను ఎదుర్కొన్న వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. బీజేపీ ఎంపీ తేజస్వీ సూర్య ఈ వీడియోను పంచుకుంటూ.. ''పౌరుల ద్వారానే చెత్త నియంత్రణ'' అంటూ కామెంట్ చేశారు. ప్రయాణికులు సీజేపీ లీడర్లను ఉద్దేశించి ''మీకు సిగ్గుండాలి'', ''స్వచ్ఛ భారత్, చెత్తను శుభ్రం చేయండి'' అని కామెంట్స్ చేశారు. ఈ వీడియోను ఉద్దేశిస్తూ తేజస్వీ సూర్య.. ''సీజేపీ గురించి నిజమైన పౌరులు ఏంటున్నారో వినండి'' అని కామెంట్ పోస్ట్ చేశారు. వీడియోలో అభిజిన్ తనను అరెస్ట్ చేసుకోండి అంటూ సవాల్ విసురుతూ.. తనపై ఉపా, ఎన్ఎస్ఏ కేసులు పెట్టుకోండి అంటూ నిరసన తెలిపారు. సీజేపీ కోకన్వీనర్ సౌరవ్ దాస్ ఒక మహిళా ప్రయాణికురాలితో ''షేమ్ అన్ యూ'' అంటూ కామెంట్ చేయగా, మహిళ తీవ్రంగా స్పందిస్తూ.. ''షేమ్ ఆన్ యూ'' అని బదులు ఇచ్చింది. మరో ప్యాసింజర్ ''కచరా సాఫ్, స్వచ్ఛ భారత్ అభియాన్''అని అంటుండటం వినొచ్చు. సీజేపీ నేతల అరెస్ట్ డ్రామాతో చాలా మంది ప్రయాణికులు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు.

# ఢిల్లీ అంతటా నిర్బంధాల పర్వం

- ఢిల్లీ అంతటా నిర్బంధాల పర్వం
- సీఈసీ రాజీనామా డిమాండ్‌తో రాజధానిలో తీవ్ర ఉద్రిక్తత
- విమానంలోనే కాక్రోచ్ జనతా పార్టీ నేతల నిర్బంధం
- వేలాదిమంది కార్యకర్తలను అదుపులోకి తీసుకున్న పోలీసులు
- మమతా బెనర్జీ, కేజ్రీవాల్ సహా ప్రతిపక్ష నేతలపై చర్యలు

**న్యూఢిల్లీ, అక్టోబర్ 10 ,**

ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ), విద్యార్థి, యువజన సంఘాలు శనివారం దేశ రాజధాని ఢిల్లీలో చేపట్టిన నిరసన కార్యక్రమం తీవ్ర రాజకీయ ఉద్రిక్తతలకు దారితీసింది. జంతర్‌మంతర్ వద్ద భారీ ప్రదర్శన నిర్వహించాలని నిరసనకారులు పిలుపునివ్వగా, కార్యక్రమం ప్రారంభానికి ముందే పోలీసులు నగరాన్ని విస్తృత భద్రతా వలయంలోకి తీసుకున్నారు. ప్రధాన రహదారులపై బారికేడ్లు, మెట్రో స్టేషన్లలో ఆంక్షలు, రైళ్ల రద్దు, మొబైల్ ఇంటర్నెట్ నిలిపివేతతో ఢిల్లీలో సాధారణ జనజీవనానికి అంతరాయం ఏర్పడింది. నిరసనకారులు జంతర్‌మంతర్‌కు చేరుకోకుండా అడ్డుకోవడమే కాకుండా పలువురు రాజకీయ నాయకులు, సామాజిక కార్యకర్తలు, జర్నలిస్టులను కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. దేశవ్యాప్తంగా వోటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో అవకతవకలు జరుగుతున్నాయని, అర్హులైన పౌరుల వోటు హక్కుకు భంగం కలుగుతోందని ప్రతిపక్షాలు, సీజేపీ ఆరోపిస్తున్నాయి. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ అధికార బీజేపీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని విమర్శిస్తున్నాయి. ఎన్నికల సంఘం ఈ ఆరోపణలను తిరస్కరిస్తూ వోటర్ల జాబితాల ప్రక్షాళన చట్టబద్ధమైన ప్రక్రియేనని వివరిస్తోంది. ఈ వివాదమే శనివారం నిరసనలకు ప్రధాన కారణమైంది.



**విమానం దిగకముందే సీజేపీ నాయకుల నిర్బంధం**

శనివారం ఉదయం చోటుచేసుకున్న అత్యంత ముఖ్యమైన పరిణామం కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే, సహనేతలు సౌరవ్ దాస్, అశుతోష్ రాంకాలను ఢిల్లీ విమానాశ్రయంలో అదుపులోకి తీసుకోవడం. ముంబయి నుంచి వచ్చిన విమానం దిగిన వెంటనే అధికారులు వారిని నిర్బంధించారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియోలు వెలుగులోకి వొచ్చాయి. ముగ్గురు నాయకులను అనంతరం వేర్వేరు ప్రాంతాలకు తరలించారు. దీప్కేను గురుగ్రామ్‌కు, రాంకాను ద్వారకాకు, సౌరవ్ దాస్‌ను మరో ప్రాంతానికి తీసుకెళ్లినట్లు వార్తలు వెల్లడించాయి. నాయకత్వాన్ని నిరసనకు దూరంగా ఉంచడానికే ఈ చర్యలు చేపట్టారని సీజేపీ ఆరోపించింది. నాయకుల నిర్బంధం తర్వాత అజింక్య షిండే నిరసన కార్యకలాపాల సమన్వయ బాధ్యతలు చేపట్టారు. జంతర్‌మంతర్‌కు చేరుకోలేకపోతే పోలీసులు ఎక్కడ అడ్డుకుంటే అక్కడే శాంతియుత నిరసన తెలియజేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

**వేలాదిమంది నిర్బంధం**

రోజంతా ఢిల్లీలోని కన్నాట్ ప్లేస్, జనపథ్, జంతర్‌మంతర్, ఆకాశవాణి భవన్, మింటో బ్రిడ్జి తదితర ప్రాంతాల్లో నిరసనకారులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మధ్యాహ్నానికి 1,500 మందికిపైగా నిర్బంధానికి గురైనట్లు వార్తలు వెలువడగా, సాయంత్రానికి నాలుగు వేల మందికిపైగా అదుపులోకి తీసుకున్నట్లు కొన్ని ప్రత్యక్ష వార్తా కథనాలు పేర్కొన్నాయి.అదనంగా, నేరచరిత్ర ఉందని పోలీసులు పేర్కొన్న వ్యక్తులను ముందస్తు భద్రతా చర్యల్లో భాగంగా అదుపులోకి తీసుకున్నట్లు అధికారులు వివరించారు.

**మమతా బెనర్జీ, కేజ్రీవాల్ సహా పలువురు నేతల నిర్బంధం**

శనివారం నిరసనల్లో ప్రతిపక్ష రాజకీయ నాయకులు కూడా పోలీసు చర్యలకు గురయ్యారు. తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ, పార్టీ ఎంపీలు డెరెక్ ఓబ్రెయిన్, డోలా సేన్ తదితరులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఢిల్లీలోని సౌత్ అవెన్యూ ప్రాంతంలో నిరసన తెలుపుతున్న మమతను పోలీసులు అడ్డుకున్నారు.ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత అరవింద్ కేజ్రీవాల్, ఇతర ఆప్ నాయకులను కూడా పోలీసులు నిర్బంధించినట్లు వార్తలు వెల్లడించాయి. వామపక్ష నాయకులు, సామాజిక కార్యకర్తలు సైతం పోలీసు చర్యలను ఎదుర్కొన్నారు. పోలీసు నిర్బంధాలను ప్రతిపక్ష నాయకులు తీవ్రంగా ఖండించారు.

# దేశంలో ప్రజాస్వామ్యం లేదా?

- ఢిల్లీలో కేంద్రం ఆంక్షలపై ప్రియాంకా గాంధీ ప్రశ్న
- మోదీ, అమిత్ షా నేతృత్వంలో నియంతృత్వ పాలన సాగుతోంది

**న్యూఢిల్లీ, అక్టోబర్ 10 ,**

ప్రధాన ఎన్నికల కమిషనర్ వైఖరి, వోటర్ల జాబితా సవరణలపై ఢిల్లీలో నిరసన తెలిపేందుకు వచ్చిన యువతను ఎక్కడికక్కడ అదుపులోకి తీసుకోవడంపై కాంగ్రెస్ ఎంపీ ప్రియాంకా గాంధీ వాద్రా తీవ్రంగా స్పందించారు. ప్రభుత్వ వైఫల్యాలు ఎక్కడ బయటపడతాయోననే భయంతోనే కేంద్ర ప్రభుత్వం నిరసనలను తీవ్రంగా అడ్డుకుంటోందని విమర్శించారు. రాజ్యాంగబద్ధ ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీసే చర్యలకు పాల్పడుతున్నవారు దేశద్రోహానికి పాల్పడుతున్నట్లేనని సంచలన వ్యాఖ్యలు చేశారు. ఢిల్లీలో సీజేపీ తలపెట్టిన ప్రత్యేక సమగ్ర సవరణ వ్యతిరేక నిరసనలపై పోలీసులు కఠిన ఆంక్షలు విధించడం, అనుమతి లేదంటూ యువతను ముందస్తుగా అదుపులోకి తీసుకోవడంపై ప్రియాంకా గాంధీ సామాజిక మాధ్యమం 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా మండిపడ్డారు. గతంలో 254 మంది ఎంపీలను ఇబ్బందులకు గురిచేసి అక్రమంగా అదుపులోకి తీసుకున్నారని ఆరోపించారు. ఇప్పుడు ప్రతిపక్ష పార్టీలు, యువజన సంఘాల నిరసనకారులపైనా అదే స్థాయిలో నిర్బంధం ప్రయోగిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

- **ఢిల్లీ దిగ్బంధంపై మండిపాటు**

ఢిల్లీ నగర సరిహద్దులను దిగ్బంధించి, రైళ్లు, మెట్రో సేవలను ఆపేసి, ఇంటర్నెట్ సేవలను నిలిపివేస్తూ అడుగడుగునా తనిఖీల పేరిట సాధారణ ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని ప్రియాంక ఆరోపించారు. రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక నిరసన హక్కును వినియోగించుకుంటున్న యువతపై దాడులు చేసి అరెస్టు చేయడం దారుణమన్నారు. ఎన్నికల సంఘం సహకారంతో ఎన్నికల్లో అక్రమాలు జరిగాయన్న ఆరోపణలపై ప్రభుత్వం తక్షణమే స్పష్టమైన సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. దేశంలో ప్రజా స్వామ్య సూత్రాలు అమలు కావడం లేదని, ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా నేతృత్వంలో స్పష్టమైన నియంతృత్వ పాలన సాగుతోందని ఆరోపించారు.

- **ఓటు హక్కును బలహీనపరిచే యత్నం: జైరామ్ రమేష్**

కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ కూడా ఈ పరిణామాలపై తీవ్రంగా స్పందించారు. శాంతియుతంగా నిరసన తెలిపేందుకు వస్తున్న యువతను చూసి కేంద్ర ప్రభుత్వం తీవ్ర భయాందోళనకు గురవుతోందని, అందుకే ఢిల్లీని ఒక కోటలా మార్చేశారని అన్నారు. రాజ్యాంగంలోని 326వ అధికరణం పౌరులకు కల్పించిన పవిత్రమైన ఓటు హక్కును, రాజ్యాంగ వ్యవస్థ బలహీనపరిచేందుకు కుట్రలు జరుగుతున్నాయని ఆయన విమర్శించారు.

## పోలీసుల అదుపులో యూట్యూబర్ ధృవ్ రాఠీ

- ఢిల్లీ నిరసనలకు వెళ్లకుండా అడ్డగింత

**న్యూఢిల్లీ, అక్టోబర్ 10,**

వివాదాస్పద యూట్యూబర్ ధృవ్ రాఠీని ఢిల్లీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. హరియాణా గుర్గావ్ లోని సెక్టార్ 56లో ఉన్న తన నివాసం నుంచి అతడిని ఢిల్లీ పోలీసులు శనివారం ఉదయం అదుపులోకి తీసుకున్నారు. ఇటీవల బెంగళూరులో సీజేపీ చేపట్టిన నిరసనలో ధృవ్ రాఠీ పాల్గొన్నాడు. ఇప్పుడు ఢిల్లీలో శనివారం జరగాల్సిన సీజేపీ ఆందోళనకు కూడా అతడు హాజరయ్యే అవకాశం ఉంది. అందుకే అతడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. దాదాపు 50 మంది పోలీసులు ఉదయం 7.48 గంటల సమయంలో ధృవ్ రాఠీ ఇంటికి వెళ్లారు. అప్పుడు ఆయన తల్లి తలుపు తీయగా అతడిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. కొంతకాలంగా విదేశాల్లో ఉంటున్న ధృవ్ రాఠీ.. సీజేపీ ఆందోళనల్లో పాల్గొనేందుకు ఇటీవల ఇండియా వచ్చాడు. అరెస్టుకు ముందు అతడు సీజేపీ ఆందోళనను ప్రభుత్వం అడ్డుకోవడంపై ఒక వీడియో రూపొందించి సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు.

**ఎక్కడికక్కడే నిర్బంధం**

ఢిల్లీ ప్రాంతంలో దాదాపు 20,000 మంది భద్రతా సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారు. అలాగే, ఢిల్లీ సహా అనేక ప్రాంతాల్లో 4,000 మందికి పైగా ఆందోళనకారుల్ని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. దీక్షా స్థలి వద్దకు రాకుండా... కొందరిని ఇంట్లోనే హౌస్ అరెస్టు చేశారు. జంతర్ మంతర్ పరిసరాల్లో బారికేడ్లు ఏర్పాటు చేశారు. ఇక్కడికి నాలుగు కిలో మీటర్ల దూరంలో ఇంటర్నెట్ సేవలను కూడా నిలిపివేశారు. అలాగే, 50కిపైగా మెట్రో స్టేషన్లను మూసి ఉంచారు. దీంతో రవాణా వ్యవస్థ స్తంభించిపోయింది. ముందు జాగ్రత్త చర్యగా ఢిల్లీలోని విద్యాసంస్థలు అన్నింటికీ శనివారం సెలవు ప్రకటించారు.

## ఎంతమంది పోలీసులనైనా తెప్పించుకోండి

- వెనక్కి తగ్గేది లేదు!
- ప్రధాని మోదీకి రాహుల్ గాంధీ సవాల్

**న్యూఢిల్లీ, అక్టోబర్ 10 :**

ఎంతమంది పోలీసులను రంగంలోకి దించినా వెనక్కి తగ్గేది లేదని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ప్రధాని నరేంద్ర మోదీని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. కాక్రోచ్ జనతా పార్టీ నిరసనల నేపథ్యంలో పోలీసుల చర్యలపై స్పందిస్తూ సామాజిక మాధ్యమం 'ఎక్స' వేదికగా ఓ వీడియో సందేశాన్ని విడుదల చేసినట్లు పేర్కొన్నారు. నాయకులను, యువతను అరెస్టు చేసినంత మాత్రాన తమ పోరాటం ఆగదని స్పష్టం చేశారు. రాజ్యాంగ పరిరక్షణ, ప్రజల హక్కుల కోసం పోరాటం కొనసాగిస్తామని ప్రకటించారు. గత పది నుంచి పదిహేనేళ్లుగా ప్రధాని మోదీ, ఆరెస్సెస్‌లతో తాను రాజకీయంగా పోరాడుతున్నానని రాహుల్ పేర్కొన్నారు. ఒక ప్రత్యర్థిని పూర్తిగా అర్థం చేసుకున్నట్లే వారి రాజకీయ విధానాలను కూడా తాను అర్థం చేసుకున్నానని వ్యాఖ్యానించారు.



నిరసనలను అడ్డుకునేందుకు పోలీసులు ఎంతమందిని మోహరించినా తమ నిర్ణయం మారదని స్పష్టం చేశారు. "మోదీ జీ.. మీకు నచ్చినట్లు చేయండి. పది వేల మంది, ఇరవై వేల మంది, యాభై వేల మంది.. ఎంతమంది పోలీసులనైనా రంగంలోకి దించండి. నాయకులను, యువతను, అందరినీ అరెస్టు చేయండి. అయినా మేము వెనక్కి తగ్గేది లేదు" అని రాహుల్ వ్యాఖ్యానించినట్లు వీడియో సందేశంలో పేర్కొన్నారు. దేశ ప్రజల గొంతుకను అణచివేయడానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించిన రాహుల్ గాంధీ, రాజ్యాంగాన్ని కాపాడుకోవడమే తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. గత పదిహేనేళ్లలో దేశానికి అన్యాయం జరిగిందని ఆరోపిస్తూ, అలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా పోరాడతామని అన్నారు. రాజ్యాంగంపై దాడి చేస్తున్నారని తాము భావిస్తున్న రాజకీయ శక్తులను ప్రజాస్వామ్య పద్ధతుల్లో ఎదుర్కొంటామని ప్రకటించారు. కాక్రోచ్ జనతా పార్టీ నిరసనల సందర్భంగా పలువురు నాయకులు, కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారనే వార్తల నేపథ్యంలో రాహుల్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. నిరసనలకు అనుమతులు, శాంతిభద్రతల అంశాలపై పోలీసుల చర్యలు ఒకవైపు చర్చకు వస్తుండగా, రాజకీయ నిరసనల హక్కుపై ప్రతిపక్షాలు ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి.

## 24 గంటల్లో సీజేపీ నేతల్ని విడుదల చేయాలి

- విడుదల చేయకపోతే నిరాహార దీక్ష చేపడతా.. సోనమ్ వాంగ్‌చుక్ అల్టిమేటం.!

**న్యూఢిల్లీ, అక్టోబర్ 10 ,**

ఢిల్లీలో కాక్రోచ్ జనతా పార్టీ(సీజేపీ) నిరసనల నేపథ్యంలో ఢిల్లీ పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నారు. జంతర్ మంతర్ వైపు వెళ్తున్న నేతల్ని, నిరసనకారుల్ని అరెస్ట్ చేశారు. మరోవైపు, ప్రముఖ యూట్యూబర్ ధ్రువ్ రాఠీ, సీజేపీ లీగల్ హెడ్ రత్నా సింగ్‌లను శనివారం ఉదయం అదుపులోకి తీసుకున్నారు. ఇదిలా ఉంటే, ముంబై నుంచి ఢిల్లీకి విమానంలో వచ్చిన సీజేపీ కన్వీనర్ అభిజిత్ దీప్కే, కోకన్వీనర్లు సౌరవ్ దాస్, అశుతోష్ రాంకాలను విమానంలోని పోలీసులు అరెస్ట్ చేసి, రహస్య ప్రాంతానికి తరలించారు. 2000 మందికి పైగా సీజేపీ, లెఫ్ట్ పార్టీల కార్యకర్తల్ని పోలీసులు అరెస్ట్ చేశారు. ఇదిలా ఉంటే, ఈ నిర్బంధంపై ప్రముఖ పర్యావరణ కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ స్పందించారు. అరెస్టైన సీజేపీ నేతల్ని 24 గంటల్లో విడుదల చేయకపోతే, తాను నిరాహార దీక్ష చేపడుతానని ప్రభుత్వానికి అల్టిమేటం జారీ చేశారు. అవసరమైనే పాదయాత్ర ద్వారా కూడా నిరసన తెలిపే అవకాశం ఉందని చెప్పారు. దేశంలో ''అప్రకటిత ఎమర్జెన్సీ'' వంటి పరిస్థితులు ఉన్నాయని అన్నారు. ప్రపంచంలో అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంలో ఇలాంటి పరిస్థితి ఎదురవుతుందని ఊహించలేదని అన్నారు. ఈ ఉద్యమానికి చాలా మంది నాయకత్వం వహించేందుకు ముందుకు రావడాన్ని చూసి సంతోషించానని, అయితే వారందర్ని అరెస్ట్ చేయడం చూసి ఆందోళనకు గురయ్యానని అన్నారు.



## ఢిల్లీని బందీగా మార్చనివ్వం

- విపక్షాల కుట్రను తిప్పికొడతామన్న రేఖా గుప్తా

**న్యూఢిల్లీ, అక్టోబర్ 10:**

దేశ రాజధాని ఢిల్లీలో నిరసనలు, పోలీసుల చర్యల నేపథ్యంలో రాజకీయ ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా ప్రతిపక్ష పార్టీలపై తీవ్ర విమర్శలు చేశారు. ప్రజాస్వామ్యం పేరుతో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ప్రయత్నాలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని హెచ్చరించారు. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ, ఆమ్ ఆద్మీ పార్టీ (AAP) అధినేత అరవింద్ కేజ్రీవాల్.. కాక్రోచ్ జనతా పార్టీ (CJP)తో కలిసి వ్యవహరిస్తున్నారని ఆమె ఆరోపించారు. సోషల్ మీడియా వేదిక ఎక్స్‌లో రేఖా గుప్తా స్పందిస్తూ.. వరుస ఎన్నికల ఓటములను జీర్ణించుకోలేక కొన్ని పార్టీలు తమ రాజకీయ అసహనాన్ని ఢిల్లీ ప్రజలపై చూపిస్తున్నాయని విమర్శించారు.

దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉంది.. యువతరమే దేశానికి పట్టుగొమ్మ అంటూ ఎన్నికల వేదికలపై రాజకీయ నాయకులు చెప్పే ప్రగల్భాలకు కొదవలేదు. కానీ అదే యువతకు రాజకీయ భవిష్యత్తును ప్రసాదించే అవకాశం, నిర్ణయాధికారం ఇచ్చే సమయం వచ్చేసరికి పార్టీల అధిష్ఠానాలు ఎందుకు వెనకడుగు వేస్తున్నాయి? ఎన్నికలు రాగానే వేలాది మంది యువత కావాలి.. బైక్ ర్యాలీలు తీయాలి, సభలకు జనాన్ని తరలించాలి, మైకులు పట్టుకుని జైకొట్టాలి, సోషల్ మీడియాలో ట్రోలింగ్స్ ఎదుర్కొంటూ పార్టీని భుజాన మోయాలి. తీరా ఫలితాలు వచ్చి పార్టీ గెలిచాక.. పదవులు, నామినేటెడ్ పోస్టులు, ఎమ్మెల్యే టికెట్లు, నాయకత్వ పగ్గాల విషయానికి వచ్చేసరికి మాత్రం అదే యువతను చివరన నిలబెట్టే సంస్కృతి ఏ పార్టీలో చూసినా కనిపిస్తోంది. జెండాలు మోసే చేతులకు నాయకత్వం వహించే అర్హత లేదా అని నేడు యువతరం ముక్తకంఠంతో ప్రశ్నిస్తోంది. (ప్రత్యేక ప్రతినిధి - సిరి న్యూస్) :




## జెండాలు యువత చేతిలో..

# పదవులు వారసుల ఖాతాలో !

### వేదికలపై యువతరం నినాదాలు
### నిర్ణయాధికారంలో మాత్రం అందని ప్రాధాన్యత
### రెక్కలు ముక్కలు చేసుకునేది కార్యకర్త
### గద్దెనెక్కేది నేతల కుటుంబీకులా?

- జెండాలు మోసిన చేతులకు మిగలని రాజకీయ గుర్తింపు
- పరిచయాలు, డబ్బుతో వారసులకు సులభ ప్రవేశం
- తన వెంట నడిచిన కార్యకర్తను లీడర్‌గా చేయడమే నాయకుడి అసలైన వారసత్వం
- గెలుపు కోసం నినదించిన గొంతుకే శాసనసభలో మాట్లాడే అవకాశం రావాలి
- అవకాశాలు లేక నిర్వీర్యమవుతున్న యువశక్తి
- యువతను ఓటు బ్యాంకుగా కాదు.. బలమైన నాయకత్వ బ్యాంకుగా చూడాలి

**సామాన్యుడికి దక్కని గుర్తింపు..**

ఒక సామాన్య కుటుంబానికి చెందిన యువకుడు రాజకీయాల్లోకి అడుగుపెడితే ఎన్నో త్యాగాలు చేయాల్సి వస్తుంది. తన సొంత కెరీర్‌ను, కుటుంబాన్ని పక్కనపెట్టి, నిద్రాహారాలు మాని, జేబులో డబ్బులు ఖర్చు పెట్టుకుని ఏళ్ల తరబడి పార్టీ జెండాను గుండెలకు హత్తుకుని పనిచేస్తాడు. ప్రజా సమస్యలపై లాఠీ దెబ్బలు తింటాడు, కేసులను ఎదుర్కొంటాడు. కానీ ఎన్నికలు రాగానే రాజకీయ కుటుంబాల్లో పుట్టిన వారసులు, వ్యాపారవేత్తలు ఎక్కడి నుంచో దిగుమతి అయి టికెట్లు ఎగరేసుకుపోతారు. గెలిచిన తర్వాత జెండా మోసిన సామాన్య కార్యకర్త ఎక్కడో గేటు బయట నిలబడాల్సి వస్తుంటే.. ఎన్నికల వేళ పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన వారు, డబ్బున్న వారసులు మాత్రం నాయకుడి పక్కన సోఫాల్లో కూర్చుంటున్నారు. వారసత్వంగా వచ్చే వారికి చిన్న వయసులోనే అవకాశాలు, మీడియా ప్రచారం, పదవులు క్షణాల్లో అందుతుంటే.. నేలమీద నడిచే సామాన్య యువకుడికి గుర్తింపు దక్కడానికి దశాబ్దాలు పడుతోంది. ఈ అంతరం ప్రజాస్వామ్య వ్యవస్థకే గొడ్డలిపెట్టు.

**నాయకుడి అసలైన వారసత్వం ఏమిటి?**

రాజకీయాల్లో నాయకుడి అసలైన వారసత్వం అంటే ఏమిటి? తన కుటుంబం నుంచి ఎంత మందిని ఎమ్మెల్యేలుగా, ఎంపీలుగా నిలబెట్టామన్నది నాయకత్వానికి కొలమానం కాదు. తన వెంట నడిచిన సాధారణ కార్యకర్తల్లో ఎంతమందిని నాయకులుగా తీర్చిదిద్దామన్నదే ఒక నాయకుడి నిజమైన ఘనత కావాలి. తన తర్వాత తన కుర్చీలో సొంత కొడుకో, కూతురో కూర్చోవాలనుకోవడం స్వార్థం అవుతుంది తప్ప నాయకత్వం అనిపించుకోదు. తనతో పాటు రోడ్లపై నడిచి, ప్రజల కోసం లాఠీ దెబ్బలు తిన్న సామాన్య యువకుడిని చట్టసభలకు పంపినప్పుడే ఆ నాయకుడి పేరు చరిత్రలో నిలిచిపోతుంది. నాయకుడి గెలుపు కోసం మైకులు బద్దలయ్యేలా నినదించిన అదే యువకుడి గొంతుకు.. రేపు అసెంబ్లీలో, పార్లమెంట్‌లో ప్రజా సమస్యలను లేవనెత్తే అవకాశం కల్పించాలి. కార్యకర్తగా మొదలైన ప్రయాణం కేవలం కార్యకర్తగానే ముగిసిపోకూడదు.. అది ప్రజా నాయకుడిగా మారే రాజమార్గం కావాలి.

**నిరాశతో దూరమవుతున్న యువశక్తి..**

ప్రజలకు సేవ చేయాలన్న తపనతో, సమాజంలో మార్పు తీసుకురావాలన్న పవిత్ర ఆశయంతో పాలిటిక్స్‌లోకి వచ్చే యువత ప్రారంభంలో ఎన్నో ఉన్నత ఆశయాలతో అడుగుపెడుతుంది. కానీ ఏళ్లు గడుస్తున్నా కేవలం ప్రచారానికే పరిమితం చేస్తూ, కనీస రాజకీయ భవిష్యత్తును చూపకపోవడంతో ఆ ఉత్సాహం క్రమంగా నీరుగారిపోతోంది. ఆశయం నిరాశగా మారి, చివరకు విరక్తితో రాజకీయాలకే దూరమయ్యే పరిస్థితులు తలెత్తుతున్నాయి. ఒక్క యువకుడు రాజకీయాలకు దూరమైతే నష్టం పార్టీకి మాత్రమే కాదు.. ఆ రూపంలో సమాజం ఒక సమర్థవంతమైన ప్రజా నాయకుడిని కోల్పోతోంది. యువతను కేవలం ఎన్నికలప్పుడు ఓట్లు రాల్చే మిషన్లుగా, పోలింగ్ బూత్ ఏజెంట్లుగా మాత్రమే చూడటం మానుకోవాలి. యువత అంటే ఓటు బ్యాంకు కాదు.. అది దేశాన్ని నడిపించే నాయకత్వ బ్యాంకు అనే స్పృహ పార్టీల అధినేతలకు రావాలి.

**మారాల్సింది యువత కాదు..**

భారతదేశ యువతలో ఆలోచనా శక్తి ఉంది, అన్యాయాన్ని ప్రశ్నించే ధైర్యం ఉంది, సాంకేతిక పరిజ్ఞానం ఉంది, పాలనను కొత్త పుంతలు తొక్కించే సమర్థత ఉంది. వారసత్వ రాజకీయాలు పూర్తిగా తప్పు కాకపోవచ్చు.. కానీ పార్టీలు, అవకాశాలు కేవలం కుటుంబాల చుట్టూనే పరిభ్రమించడం మాత్రం ముమ్మాటికీ ప్రజాస్వామ్య విరుద్ధం. పార్టీకి అసలైన బలం ఏసీ రూముల్లో ఉండే అధిష్ఠానం కాదు.. గ్రామాల్లో, వార్డుల్లో, పల్లెల్లో ఎండనక వాననక తిరుగుతూ ప్రజల మధ్య ఉండే కార్యకర్తలే. ఆ క్షేత్రస్థాయి శ్రామికులను కేవలం జెండాలు మోయడానికే కాకుండా, విధాన నిర్ణయాలు తీసుకునే స్థాయికి చేర్చడమే రాజకీయ పార్టీల బాధ్యత. జెండా మోసిన చేతికి ఒకరోజు నాయకత్వ పగ్గాలు అందినప్పుడు.. సభలకు జనాన్ని తీసుకొచ్చిన యువకుడే ప్రజా వేదికపై సమస్యలను గర్జించినప్పుడు మాత్రమే వ్యవస్థలో అసలైన మార్పు సాధ్యమవుతుంది. నేటి యువ కార్యకర్తను రేపటి ప్రజా నాయకుడిగా తీర్చిదిద్దే సంస్కృతి వచ్చినప్పుడే మన ప్రజాస్వామ్యానికి అసలైన గౌరవం లభిస్తుంది.

---

# జర్నలిస్టులు, వారి కుటుంబ సభ్యుల ఆరోగ్యమే లక్ష్యంగా ఉచిత వైద్య శిబిరం

- స్మాల్ అండ్ మీడియం న్యూస్‌పేపర్స్ విభాగము, (టీయూడబ్ల్యూజే-ఐజేయూ)
- అక్టోబర్ 14న సన్‌రైజ్ హాస్పిటల్‌లో నిర్వహణ...
- ఉచిత వైద్య పరీక్షలు, వైద్యుల సంప్రదింపులు మందుల పంపిణీ

**సంగారెడ్డి, 9 అక్టోబర్, (సిరి న్యూస్)** : సమాజంలో ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువస్తూ, ప్రజల పక్షాన అక్షరాయుధంతో నిరంతరం పోరాడే జర్నలిస్టుల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా సంగారెడ్డిలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నారు. స్మాల్ అండ్ మీడియం న్యూస్‌పేపర్స్ విభాగము, తెలంగాణ స్టేట్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టీయూడబ్ల్యూజేఐజేయూ) సంగారెడ్డి జిల్లా యూనిట్ ఆధ్వర్యంలో, సన్‌రైజ్ హాస్పిటల్, రథసారథి తెలుగు దినపత్రిక సహకారంతో ఈ వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నారు. ఈ శిబిరంలో జర్నలిస్టులతో పాటు వారి కుటుంబ సభ్యులకు కూడా ఉచితంగా వైద్య సేవలు అందించనున్నారు. అక్టోబర్ 14న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు సన్‌రైజ్ హాస్పిటల్ సమీపంలో ఈ వైద్య శిబిరం జరగనుంది. జర్నలిస్టులు, వారి కుటుంబ సభ్యులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరుతున్నారు.

**జర్నలిస్టుల ఆరోగ్య పరిరక్షణకు ప్రత్యేక చొరవ**

ప్రజాస్వామ్యంలో నాలుగో స్తంభంగా భావించే జర్నలిజం రంగంలో పనిచేసేవారు నిత్యం వార్తల సేకరణ, క్షేత్రస్థాయి పర్యటనలు, రాజకీయ, సామాజిక పరిణామాల పరిశీలన, ప్రజా సమస్యలపై నిరంతర కృషి వంటి బాధ్యతలతో తీరికలేని జీవనాన్ని గడుపుతుంటారు. అనేక సందర్భాల్లో సమయానికి ఆహారం తీసుకోలేకపోవడం, నిద్రకు తగిన సమయం కేటాయించలేకపోవడం, పని ఒత్తిడిని ఎదుర్కోవడం వంటి పరిస్థితులు వారి ఆరోగ్యంపై ప్రభావం చూపే అవకాశం ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో జర్నలిస్టులకు వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావాలనే ఉద్దేశంతో ఈ ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. విధి నిర్వహణలో నిరంతరం ప్రజల ఆరోగ్యం, భద్రత, సమస్యలపై వార్తలు అందించే జర్నలిస్టులు తమ ఆరోగ్యాన్ని కూడా నిర్లక్ష్యం చేయకూడదనే సందేశాన్ని ఈ కార్యక్రమం అందిస్తోంది.

**జర్నలిస్టుల కుటుంబ సభ్యులకూ వైద్య సేవలు**

ఈ శిబిరం కేవలం జర్నలిస్టులకే పరిమితం కాకుండా వారి కుటుంబ సభ్యులకు కూడా ఉపయోగపడేలా రూపొందించారు. జర్నలిస్టుల కుటుంబాల్లోని వారికి అవసరమైన ప్రాథమిక వైద్య పరీక్షలు, సంబంధిత వైద్య నిపుణుల సలహాలు పొందేందుకు ఇది అవకాశం కల్పించనుంది. వృత్తిపరమైన ఒత్తిళ్ల మధ్య కుటుంబ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపడం ఎంతో అవసరం. ఈ నేపథ్యంలో జర్నలిస్టుల కుటుంబ సభ్యులకు సైతం వైద్య సేవలను అందించడం ద్వారా ఆరోగ్య పరిరక్షణ పట్ల అవగాహన పెంపొందించాలనే లక్ష్యం ఈ కార్యక్రమంలో కనిపిస్తోంది.




**ఉచిత వైద్య సంప్రదింపులు.. మందుల పంపిణీ**

వైద్య శిబిరంలో భాగంగా ఉచిత వైద్య సంప్రదింపులతో పాటు ఉచితంగా మందులు అందించనున్నట్లు ప్రచార పోస్టర్‌లో పేర్కొన్నారు. గుండె సంబంధిత సమస్యలు, శ్వాసకోశ వ్యాధులు, ఎముకలు, కీళ్ల సమస్యలు, సాధారణ వైద్య సమస్యలు, మధుమేహం, నరాల సంబంధిత సమస్యలు, స్త్రీల ఆరోగ్య సమస్యలకు సంబంధించి వైద్య నిపుణుల సేవలను అందుబాటులో ఉంచనున్నారు. అలాగే ఈసీజీ (ఈసీజీ), 2డీ ఎకో (2డిసీహెచ్ఓ), ఇతర పాథలాజికల్ ల్యాబ్ పరీక్షలు కూడా శిబిరంలో భాగంగా పేర్కొనబడ్డాయి. అయితే, పరీక్షల అర్హత, అందుబాటు, ఉచితంగా నిర్వహించే పరీక్షల పరిధి తదితర వివరాలను శిబిరానికి హాజరయ్యే ముందు నిర్వాహకులు లేదా ఆసుపత్రి సిబ్బంది వద్ద నిర్ధారించుకోవడం మంచిది.

**ఆరోగ్య సమస్యలను ముందుగానే గుర్తించుకోవాలి**

చాలామంది పని ఒత్తిడి కారణంగా చిన్నచిన్న ఆరోగ్య సమస్యలను నిర్లక్ష్యం చేస్తుంటారు. ముఖ్యంగా రక్తపోటు, మధుమేహం, గుండె సంబంధిత సమస్యలు, శ్వాసకోశ ఇబ్బందులు వంటి సమస్యలను ముందుగానే గుర్తించేందుకు తగిన వైద్య పరీక్షలు చేయించుకోవడం ఉపయోగకరంగా ఉంటుంది. ఈ వైద్య శిబిరాన్ని వినియోగించుకుని తమ ఆరోగ్య స్థితిని తెలుసుకోవడంతో పాటు, అవసరమైన వైద్య సలహాలు తీసుకోవాలని నిర్వాహకులు సూచిస్తున్నారు. ఇప్పటికే వైద్య చికిత్స పొందుతున్నవారు తమ పాత వైద్య నివేదికలు, ప్రస్తుతం వాడుతున్న మందుల వివరాలు వెంట తీసుకెళ్తే వైద్యులకు సమస్యను వివరించడం సులభమవుతుంది. సంఘాలు, ఆసుపత్రి సహకారంతో సేవా కార్యక్రమం స్మాల్ అండ్ మీడియం న్యూస్‌పేపర్స్ విభాగము, టీయూడబ్ల్యూజేఐజేయూ సంగారెడ్డి జిల్లా యూనిట్, సన్‌రైజ్ హాస్పిటల్, రథసారథి తెలుగు దినపత్రిక పరస్పర సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహించబడుతోంది. జర్నలిస్టుల సంక్షేమం, ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యం ఇస్తూ ఇటువంటి కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. జర్నలిస్టుల వృత్తిపరమైన సంక్షేమంతో పాటు వారి ఆరోగ్య అవసరాలను గుర్తించి సహాయపడే కార్యక్రమాలు మరింత విస్తృతంగా నిర్వహించాల్సిన అవసరం ఉంది. ఈ దిశగా సంగారెడ్డిలో ఏర్పాటు చేస్తున్న ఉచిత వైద్య శిబిరం జర్నలిస్టులకు, వారి కుటుంబ సభ్యులకు ఉపయోగపడుతుందని నిర్వాహకులు ఆశిస్తున్నారు.

**శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపు**

అక్టోబర్ 14న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు సన్‌రైజ్ హాస్పిటల్ సమీపంలో జరిగే ఈ శిబిరానికి జర్నలిస్టులు, వారి కుటుంబ సభ్యులు హాజరై ఉచిత వైద్య సేవలను వినియోగించుకోవాలని నిర్వాహకులు విజ్ఞప్తి చేస్తున్నారు. వైద్య పరీక్షల సమయాలు, అవసరమైన ముందస్తు నమోదు, పరీక్షల లభ్యత వంటి వివరాల కోసం సంబంధిత నిర్వాహకులను సంప్రదించాలని సంగారెడ్డి జిల్లా స్మాల్ అండ్ మీడియం న్యూస్‌పేపర్స్ విభాగము అధ్యక్షులు మొహమ్మద్ సిద్ధిఖ్9160182182, కార్యదర్శి చౌహాన్ ఈశ్వర్6303622789, టీయూడబ్ల్యూజేఐజేయూ సంగారెడ్డి జిల్లా యూనిట్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నాము. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టీయూడబ్ల్యూజేఐజేయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఫైసల్, గెస్ట్ ఆఫ్ హానర్ గా జిల్లా అధ్యక్షులు బండారు యాదగిరి (జిల్లా కమిటీ బృందం) హాజరుకానున్నారు.

---

# సంప్రదాయ బద్ధంగా బతుకమ్మ వేడుకలు ప్రారంభం



**పటాన్ చెరు, అక్టోబర్ 10, (సిరి న్యూస్):** తెలంగాణ సాంస్కృతిక గర్వానికి ప్రతీకగా నిలిచే బతుకమ్మ వేడుకలు పటాన్ చెరు డివిజన్ పరిధిలోని నవ్య ది గ్రాండ్ కాలనీలో సంప్రదాయ బద్ధంగా ఘనంగా ప్రారంభమయ్యాయి. పెద్దల అమావాస్యతో ప్రారంభమయ్యే ఈ తొమ్మిది రోజుల పూల పండుగ అక్టోబర్ 18న సద్దుల బతుకమ్మతో ముగుస్తుంది. బతుకమ్మ పండుగ ప్రకృతి, స్త్రీత్వం, కుటుంబ బంధాలు, సమాజ సమగ్రతను ఆరాధించే వేడుకగా తెలంగాణ ప్రజల హృదయాల్లో విశేష స్థానం కలిగి ఉంది. ఈ సందర్భంగా కాలనీ మహిళలు ఉత్సాహం, ఉల్లాసంతో సంప్రదాయ దుస్తులు ధరించి బతుకమ్మలను తయారు చేశారు. గున్న, బంతి, చామంతి, గన్నేరు, తంగేడు, మందారం వంటి సీజనల్ పూలతో అందంగా అలంకరించిన బతుకమ్మలను కాలనీలోని మల్టీ పర్పస్ హాల్‌లో ఏర్పాటు చేశారు. రంగురంగుల పూల అలంకరణతో వేడుక ప్రాంగణం ఆధ్యాత్మిక వైభవంతో, పండుగ శోభతో కళకళలాడింది. మహిళలు బతుకమ్మల చుట్టూ నిలిచి సంప్రదాయ బతుకమ్మ పాటలు ఆలపిస్తూ, చేతులు చప్పట్లు కొడుతూ ఉత్సవ నృత్యం చేశారు. "బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో" పాటల దుందుభితో హాలు మార్మోగింది. రాత్రి 9 గంటల వరకు కొనసాగిన ఈ కార్యక్రమంలో మహిళలు, బాలికలు, పెద్దలు కలిసి పాల్గొని పండుగ ఆనందాన్ని పంచుకున్నారు. బతుకమ్మ పండుగలో ప్రతి రోజుకు ప్రత్యేక పేరు, ప్రత్యేక నైవేద్యం ఆచారం ఉంటుంది; మొదటి రోజు ఎంగిలి పువ్వుల బతుకమ్మగా జరుగుతుంది. ఈ వేడుకల్లో కాలనీ కమిటీ బాధ్యులు కె.వి. రవీందర్, వెంకట్ రెడ్డి, వికాస్, వెంకటేష్, లక్ష్మీనారాయణ, శ్రీనివాస్ రెడ్డి, గోపాల్ రెడ్డి, రిషి వర్ధన్ రెడ్డి, హరి గోపాల్, రంగయ్య నాయుడు, చరణ్, రాజశేఖర్, మూర్తి, రాజు, రాజేష్, నరేంద్ర, సిద్ధు, ఫణి, జీవన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. వేడుకల ఏర్పాట్లలో కమిటీ సభ్యులు విశేష కృషి చేశారు. బతుకమ్మ కేవలం పూజా కార్యక్రమం మాత్రమే కాదని, తరతరాలుగా సాగుతున్న తెలంగాణ సంప్రదాయాన్ని తరం నుంచి తరానికి అందించే వేదిక అని అన్నారు. పట్టణ జీవితంలో కూడా పొరుగింటి మహిళలు కలిసి పండుగ ఆనందాన్ని పంచుకోవడం విశేషమని, ఈ ఏడాది కాలనీలో మరింత భారీగా బతుకమ్మ వేడుకలు నిర్వహించనున్నట్లు కమిటీ బాధ్యులు తెలిపారు. ముగింపు రోజైన సద్దుల బతుకమ్మ సందర్భంగా ప్రత్యేక నైవేద్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, బతుకమ్మ నిమజ్జనం నిర్వహించనున్నారు.

# ప్రతిభ స్కూల్లో బతుకమ్మ సంబరాలు



**జిన్నారం అక్టోబర్ 09 సిరి న్యూస్**

మండల కేంద్రమైన జిన్నారంలో స్థానిక ప్రతిభ విద్యానికేతన్ హై స్కూల్లో బతుకమ్మ సంబరాలు ప్రిన్సిపల్ సార శ్రీనివాస్ ఆధ్వర్యంలో విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పూల పండుగ నేపథ్యాన్ని పురస్కరించుకొని బతుకమ్మను సాంప్రదాయబద్ధంగా తీర్చిదిద్ది ప్రత్యేక పూజలు నిర్వహించారు. బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించడం పట్ల విద్యార్థులను ఉపాధ్యాయ బృందాన్ని ప్రిన్సిపల్ శ్రీనివాస్ అభినందించారు. ఈ సందర్భంగా బతుకమ్మ ఆటపాటలతో విద్యార్థులు అలరించారు. సంబరాల తదనంతరం స్థానిక అక్కమ్మ చెరువులో బతుకమ్మ ను నిమజ్జనం చేశారు.

# తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు బతుకమ్మ ప్రతీక.. ఆరెకపూడి గాంధీ



**శేరిలింగంపల్లి,అక్టోబర్ 10 (సిరి న్యూస్)**: తెలంగాణ ఆడపడుచులందరికీ ఎంగిలి పూల బతుకమ్మ పర్వదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ పేర్కొన్నారు. చందానగర్ డివిజన్‌లోని పీజేఆర్ స్టేడియంలో స్వర్గీయ రాగం సుజాత యాదవ్ జయంతి సందర్భంగా రాగం సుజాత నాగేందర్ యాదవ్ ఫౌండేషన్, శేరిలింగంపల్లి మండల గుర్తింపు పొందిన ప్రైవేటు పాఠశాలల యాజమాన్య సంఘం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా బతుకమ్మ సంబరాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వి. హనుమంతరావు, మాజీ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ త్రిపురనేని వెంకటరత్నం, మాజీ కార్పొరేటర్లు రాగం నాగేందర్ యాదవ్, వి. జగదీశ్వర్ గౌడ్, నార్నె శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు రఘునాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ బతుకమ్మ పండుగ తెలంగాణ ఆచార వ్యవహారాలు, సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని, పూలనే దేవతగా భావించి ప్రకృతిని ఆరాధించే విశిష్టమైన పండుగగా దీనికి ప్రత్యేక గుర్తింపు ఉందని అన్నారు. ఆడపడుచుల ఆనందానికి, ఐక్యతకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ వేడుకలను పీజేఆర్ స్టేడియంలో ఘనంగా నిర్వహించడం సంతోషకరమని, నిర్వాహకులను ప్రత్యేకంగా అభినందిస్తున్నానని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంతో పాటు శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని మహిళలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షిస్తూ ఎంగిలిపూల బతుకమ్మ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ వేడుకల్లో మహిళలు, విద్యార్థులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# భవిత లో బతుకమ్మ సంబరాలు



**సదాశివపేట. అక్టోబర్ 10. (సిరిన్యూస్)**

సదాశివపేట పట్టణంలోని భవిత జూనియర్ కళాశాలలో బతుకమ్మ పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ మధుకర్ రెడ్డి మాట్లాడుతూ అన్ని రకాల పూలను పూజించే గొప్ప సంస్కృతి తెలంగాణ రాష్ట్రానికి మాత్రమే ఉన్నది, కావున ఈ పండుగను మన తెలంగాణ రాష్ట్ర పండుగగా గుర్తించడం జరిగిందని పేర్కొన్నారు. విద్యార్థిని విద్యార్థులు మీరు కూడా భవిష్యత్తులో ఒక ఉన్నత స్థానానికి వెళ్లి ఇలాంటి సంస్కృతి గురించి తెలియజేసే విధంగా ఉండాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ రాజు, శ్రీ సాధన డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ రవి, భవిత కళాశాల అధ్యాపకులు మల్లేశం, వీరన్న, చారి, గోపాల్, దేవప్ప, సుజాత, సంతోషి, ఉమారాణి, అసిఫా, పల్లవి, వాసవి, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.



# బొంతపల్లిలో శరన్నవరాత్రి ఉత్సవాలకు సర్వం సిద్ధం

- **పది రోజుల పాటు పది రూపాల్లో భద్రకాళి అమ్మవారి దర్శనం**
- **ఈ నెల 11 నుంచి 20వ తేదీ వరకు ప్రత్యేక పూజలు**
- **భక్తులకు దర్శనమివ్వనున్న అమ్మవారు**

**గుమ్మడిదల, అక్టోబర్ 10 (సిరి న్యూస్):**



సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం బొంతపల్లి శ్రీ భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 11వ తేదీ నుంచి 20వ తేదీ వరకు పది రోజుల పాటు అమ్మవారి శరన్నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించనున్నారు. ఉత్సవాల్లో భాగంగా ప్రతిరోజూ భద్రకాళీ అమ్మవారిని వివిధ రూపాల్లో, విశేష అలంకరణలతో అలంకరించి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు ఆలయ అర్చకులు దర్శన సౌకర్యం కల్పించనున్నారు. శరన్నవరాత్రి ఉత్సవాలకు హిందూ సంప్రదాయంలో విశేష ప్రాధాన్యత ఉంది. ఈ తొమ్మిది రాత్రులు, విజయదశమి పర్వదినంతో కూడిన ఉత్సవాల్లో అమ్మవారిని వివిధ రూపాల్లో ఆరాధించడం ఆనవాయితీ. దుర్గాదేవి శక్తి స్వరూపాన్ని కొలుస్తూ భక్తులు ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహిస్తారు. బొంతపల్లి క్షేత్రంలోనూ ఈ ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు ఆలయ అధికారులు, అర్చకులు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రతిరోజూ అమ్మవారి అలంకరణను తిలకించి, ప్రత్యేక పూజల్లో పాల్గొనేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉంది.

**రోజుకో అలంకరణ పది రోజులూ ప్రత్యేక పూజలు**

ఉత్సవాల్లో భాగంగా అక్టోబర్ 11న బాల త్రిపుర సుందరీ దేవిగా, 12న శ్రీ గాయత్రీ దేవిగా, 13న శ్రీ అన్నపూర్ణాదేవిగా, 14న శ్రీ కామేశ్వరీ దేవిగా, 15న శ్రీ లలితా త్రిపుర సుందరీ దేవిగా, 16న శ్రీ సరస్వతీ దేవిగా, 17న శ్రీ మహాలక్ష్మీ దేవిగా, 18న శ్రీ రాజరాజేశ్వరీ దేవిగా, 19న శ్రీ భద్రకాళీ దేవిగా, 20న విజయదశమి పండుగ రోజు శ్రీ విజయదుర్గాదేవిగా అమ్మవారు భక్తులకు దర్శనమివ్వనున్నారు. ప్రతి రోజూ ఆయా రూపాలకు అనుగుణంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకునేలా ఏర్పాట్లు చేయనున్నారు. ఉత్సవాల సందర్భంగా ఆలయంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొననుంది. కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకుని ఆశీస్సులు పొందేందుకు భక్తులు ఆసక్తి చూపుతున్నారు.

**భక్తులకు దర్శన సౌకర్యం**

బొంతపల్లి శ్రీ భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయం పరిసర ప్రాంతాల్లో ప్రసిద్ధి చెందిన ఆధ్యాత్మిక క్షేత్రంగా గుర్తింపు పొందింది. శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ అధికారులు, అర్చకులు తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. పది రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాల్లో భక్తులు పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని ఆలయ కార్యనిర్వహణాధికారి గ్రామ బ్రహ్మచారి తెలిపారు.

# ప్లాస్టిక్ రహిత తెల్లాపూర్..

- **తెనా – అక్యుమెన్ స్కూల్ సంయుక్తంగా చేయూత**
- **10 వేల పునర్వినియోగ సంచుల పంపిణీ..**
- **ఏడాది పాటు పర్యావరణ కార్యక్రమాలకు సహకారం**

**రామచంద్రపురం, అక్టోబర్ 10 (సిరి న్యూస్):**






ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి పర్యావరణ పరిరక్షణకు ప్రజలను భాగస్వాములను చేసే లక్ష్యంతో తెల్లాపూర్ నైబర్‌హుడ్ అసోసియేషన్ (తెనా) గ్రీన్ ఆర్మీ, అక్యుమెన్ స్కూల్ సంయుక్తంగా ముందడుగు వేశాయి. ఇందులో భాగంగా 10 వేల పునర్వినియోగ సంచుల పంపిణీ కార్యక్రమాన్ని శనివారం ప్రారంభించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ సంచులకు బదులుగా పునర్వినియోగ సంచులను ఉపయోగించేలా ప్రజల్లో అవగాహన కల్పించనున్నారు.

**ఏడాది పాటు పర్యావరణ కార్యక్రమాలకు సహకారం**

పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలను విస్తృతం చేసేందుకు అక్యుమెన్ స్కూల్, తెనా గ్రీన్ ఆర్మీ మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. దీని ప్రకారం రానున్న ఏడాది పాటు తెనా గ్రీన్ ఆర్మీ చేపట్టే చెరువుల శుభ్రత, మొక్కల పెంపకం, ప్లాస్టిక్ వినియోగానికి వ్యతిరేకంగా ప్రచారం, వ్యర్థాల నిర్వహణ, పర్యావరణ అవగాహన కార్యక్రమాలకు పాఠశాల సహకారం అందించనుంది. తెనా గ్రీన్ ఆర్మీ ఇప్పటికే తెల్లాపూర్ పరిసర ప్రాంతాల్లో చెరువుల పరిరక్షణ, పారిశుద్ధ్య కార్యక్రమాలు, మొక్కల పెంపకం, ప్లాస్టిక్ వ్యతిరేక ప్రచారం చేపడుతూ పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తోంది. విద్యాసంస్థలు, నివాస సముదాయాలు, ప్రజలు సమిష్టిగా ముందుకు వచ్చినప్పుడే పర్యావరణ సమస్యలకు సమర్థవంతమైన పరిష్కారాలు సాధ్యమవుతాయని నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీనా అధ్యక్షుడు రమణ ఈశ్వరగారి, ఉపాధ్యక్షులు మదన్ మోహన్, దీప్తి రెడ్డి, ప్రతాప్, ప్రధాన కార్యదర్శి రవి కిరణ్, సంయుక్త కార్యదర్శి రామ్ కుమార్ పాల్గొన్నారు. అక్యుమెన్ స్కూల్ తరపున వ్యవస్థాపకులు దావూద్ షేక్, సందీప్ పుసులూరు, రమణ, పూర్ణిమ వెన్నెడ్డి, బోర్డు సలహాదారు హేమ చెన్నుపాటి, ప్రిన్సిపాల్ శ్వేత వర్మ హాజరయ్యారు. ఈ సందర్భంగా తెనా గ్రీన్ ఆర్మీ ప్రతినిధులు మాట్లాడుతూ.. ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణం ప్రతి ఒక్కరి బాధ్యతని పేర్కొన్నారు. మార్కెట్లకు వెళ్లేటప్పుడు పునర్వినియోగ సంచులు వెంట తీసుకెళ్లాలని, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని, తడి, పొడి వ్యర్థాలను వేర్వేరుగా నిర్వహించాలని ప్రజలకు సూచించారు. అక్యుమెన్ స్కూల్ సహకారంతో ప్రజల భాగస్వామ్యాన్ని పెంచి తెల్లాపూర్‌ను పరిశుభ్రమైన, పచ్చదనంతో నిండిన ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని తెలిపారు.

# మొక్కజొన్న సాగులోఅధిక దిగుబడి సాధించిన రైతు

- **ఐదు ఎకరాల్లో పైలట్ మొక్కజొన్న సాగు**
- **ఎకరాకు 40 నుంచి 45 క్వింటాళ్ల దిగుబడి వచ్చినట్లు రైతు**

**గుమ్మడిదల, అక్టోబర్ 10 (సిరి న్యూస్):**



మొక్కజొన్న సాగులో ఆధునిక పద్ధతులు, నాణ్యమైన విత్తనాల ఎంపికతో అధిక దిగుబడులు సాధించవచ్చని గుమ్మడిదల రైతు ఆనంద్ యాదవ్ నిరూపించారు. గుమ్మడిదల మండల కేంద్రానికి చెందిన ఆయన ఐదు ఎకరాల్లో జినెక్స్ సీడ్స్ సంస్థకు చెందిన పైలట్ జీఎక్స్ 330 సంకర మొక్కజొన్న విత్తనాలను సాగు చేసి, ఎకరాకు సుమారు 40 నుంచి 45 క్వింటాళ్ల వరకు దిగుబడి సాధించినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా జినెక్స్ సీడ్స్ సంస్థ ఆధ్వర్యంలో గుమ్మడిదలలో ప్రత్యేక రైతుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో తన సాగు అనుభవాలను తోటి రైతులతో పంచుకున్న ఆనంద్ యాదవ్ మాట్లాడుతూ పంట సాగులో సరైన యాజమాన్య పద్ధతులు పాటించడం, అవసరమైన సమయంలో తగిన పోషకాలను అందించడం, పంటను నిరంతరం పర్యవేక్షించడం ద్వారా మంచి దిగుబడులు సాధించే అవకాశం ఉంటుందని వివరించారు. తాను సాగు చేసిన మొక్కజొన్న పంటలో ఆశించిన స్థాయిలో దిగుబడి రావడం సంతోషంగా ఉందని తెలిపారు. ఈ రకం సాగు విధానంపై ఇతర రైతులకు కూడా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జినెక్స్ సీడ్స్ ప్రాంతీయ నిర్వాహకుడు కోటిరెడ్డి మాట్లాడుతూ రైతులు తమ ప్రాంతానికి, నేల స్వభావానికి, సాగునీటి లభ్యతకు అనుగుణంగా విత్తనాలను ఎంపిక చేసుకోవాలని సూచించారు. నాణ్యమైన విత్తనాలతో పాటు సరైన సాగు యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా దిగుబడులను మెరుగుపరుచుకునే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. రైతులకు నాణ్యమైన విత్తనాలను అందించేందుకు తమ సంస్థ కృషి చేస్తోందని తెలిపారు. గుమ్మడిదలలోని విత్తనాలు, ఎరువుల విక్రయ కేంద్రం అధినేత పవన్ మాట్లాడుతూ రైతులకు అందుబాటులో ఉన్న వివిధ విత్తన రకాలు, ఎరువుల వినియోగం, పంట సాగులో పాటించాల్సిన మెలకువల గురించి వివరించారు. పంట అవసరాలకు అనుగుణంగా ఎరువులను వినియోగించాలని, వ్యవసాయ నిపుణుల సూచనలు పాటించాలని రైతులకు సూచించారు. ఈ సమావేశంలో గుమ్మడిదలతో పాటు పరిసర గ్రామాలకు చెందిన పలువురు రైతులు పాల్గొన్నారు.

# మహాలయ అమావాస్య.. బతుకమ్మ సంబరాలు





- **ఆటపాటలతో సందడి చేసిన మహిళలు**
- **చెరువుల్లో బతుకమ్మల నిమజ్జనం**

**గుమ్మడిదల, అక్టోబర్ 10 (సిరి న్యూస్):**

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ సంబరాలు గుమ్మడిదల మున్సిపాలిటీతో పాటు మండలంలోని వివిధ గ్రామాల్లో శనివారం ఉత్సాహంగా జరిగాయి. మహాలయ అమావాస్యతో పాటు బతుకమ్మ పండుగ ప్రారంభం కావడంతో మహిళలు సంప్రదాయబద్ధంగా వేడుకలు నిర్వహించారు. పూలతో అందంగా బతుకమ్మలను పేర్చి, ఒకచోట చేరి ఆటపాటలతో సందడి చేశారు. మహాలయ అమావాస్య సందర్భంగా పలువురు తమ పూర్వీకులను స్మరించుకుంటూ ఇళ్లలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తమ ఆచార సంప్రదాయాల ప్రకారం బ్రాహ్మణుల చేత పూజలు చేయించి, బియ్యాన్ని దానం చేశారు. కుటుంబ పెద్దలను స్మరించుకుంటూ వారి ఆత్మశాంతి ఉండాలని కోరారు. మరోవైపు బతుకమ్మ పండుగ మొదటి రోజు కావడంతో మహిళలు వివిధ రకాల రంగురంగుల పూలతో బతుకమ్మలను ఆకర్షణీయంగా అలంకరించారు. గ్రామాల్లోని ఒకచోట బతుకమ్మలను ఉంచి, గౌరమ్మను బతుకమ్మ రూపంలో కొలుస్తూ సంప్రదాయ పాటలు పాడారు. మహిళల కోలాటాలు, ఆటపాటలతో పండుగ వాతావరణం నెలకొంది. తెలంగాణ ఆడపడుచులు ఎంతో భక్తిశ్రద్ధలతో జరుపుకునే బతుకమ్మ పండుగలో ప్రకృతిని పూజించడం, పూలకు ప్రాధాన్యతనివ్వడం ప్రత్యేకతగా నిలుస్తుంది. మహిళలంతా ఒకచోట చేరి సంతోషంగా వేడుకల్లో పాల్గొనడంతో గ్రామాల్లో సందడి నెలకొంది. వేడుకల అనంతరం స్థానిక చెరువుల్లో బతుకమ్మలను నిమజ్జనం చేసి అమ్మవారికి భక్తితో వీడ్కోలు పలికారు. గుమ్మడిదల మున్సిపాలిటీతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో బతుకమ్మ సంబరాలు సంప్రదాయబద్ధంగా కొనసాగాయి. తెలంగాణ సంస్కృతి, ఐక్యతకు ప్రతీకగా నిలిచే ఈ పండుగ మహిళల్లో ఆనందోత్సాహాలను నింపింది.

# గుమ్మడిదల మండలం ఏర్పాటుతో మరింత ప్రగతి

- గుమ్మడిదల ప్రగతికి నాంది కేసీఆర్
- నూతన మండల ఏర్పాటుతోనే అభివృద్ధికి పునాది
- కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేసిన బీఆర్ఎస్ నాయకులు

**గుమ్మడిదల, అక్టోబర్ 10 (సిరి న్యూస్):**



గుమ్మడిదల ప్రత్యేక మండలంగా ఏర్పడటంతోనే ఈ ప్రాంత అభివృద్ధికి పునాది పడిందని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్ అన్నారు. గుమ్మడిదల నూతన మండలంగా ఏర్పడి పదేళ్లు పూర్తయిన సందర్భంగా శనివారం బీఆర్ఎస్ మండల కమిటీ ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేసి తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. మండల పార్టీ అధ్యక్షుడు కొత్తపల్లి ప్రభాకర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ 2016లో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ హయాంలో గుమ్మడిదలను ప్రత్యేక మండలంగా ఏర్పాటు చేయడంతో పరిపాలనా సౌలభ్యం పెరిగిందని పేర్కొన్నారు. మండల కేంద్రంగా ఏర్పడిన తర్వాత ప్రభుత్వ కార్యాలయాలు, మౌలిక సదుపాయాల అభివృద్ధికి మార్గం సుగమమైందని తెలిపారు. ఒకప్పుడు గ్రామ స్థాయిలో ఉన్న గుమ్మడిదల నేడు మండల కేంద్రంతో పాటు మున్సిపాలిటీగా ఎదగడం ఈ ప్రాంత అభివృద్ధికి నిదర్శనమని నాయకులు పేర్కొన్నారు. మండల ఏర్పాటు ద్వారా ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత చేరువయ్యాయని, వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు అవకాశం ఏర్పడిందని వివరించారు. గుమ్మడిదల ప్రగతిలో నూతన మండల ఏర్పాటు కీలక మలుపుగా నిలిచిందని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చిమ్ముల నరసింహారెడ్డి, వార్డు కౌన్సిలర్లు రాజశేఖర్, చక్రపాణి, విజయ భాస్కర్‌రెడ్డి, నాయకులు నంద్యాల విష్ణువర్ధన్‌రెడ్డి, దేవేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మహేష్, శేఖర్‌రెడ్డి, సదానందరెడ్డి, మొగులయ్య, అంజనేయులు యాదవ్, వినోద్ గౌడ్, రమేష్, సత్యనారాయణ, ప్రకాష్, రాజు, రాము తదితరులు పాల్గొన్నారు.

# బడి పిల్లలకు సాఫ్ట్‌వేర్ దంపతుల బాసట



- కొడకంచి బడిలో 100 మందికి స్కూల్ కిట్లు

**జిన్నారం అక్టోబర్ 10 సిరి న్యూస్**

జిన్నారం మున్సిపల్ పరిధిలోని కొడకంచి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులకు స్కూల్ బ్యాగులు టిఫిన్ బాక్సులు స్టేషనరీ, నోట్ బుక్స్ పెన్నులు మొదలైనవి మరియు ఇతర అవసరమైన సామాగ్రి అందజేసిన కృషి డిఫెన్స్ కాలనీకి చెందిన సాఫ్ట్‌వేర్ దంపతులు, ఈ సందర్భంగా సాఫ్ట్‌వేర్ దంపతులు మాట్లాడుతూ... ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు ఎంతో ప్రతిభవంతులు అని వారికి సరైన వసతులు ఆసరా అందిస్తే అద్భుతాలు సాధిస్తారని పేర్కొన్నారు. సమాజం నుంచి పొందిన దానిలో కొంత భాగాన్ని తిరిగి సమాజానికి ఇచ్చే క్రమంలోనే ఈ చిన్న సహాయం చేశామని తెలిపారు. విద్యార్థులు సమయాన్ని వృధా చేయకుండా కష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరుకుని తమ తల్లిదండ్రులకు పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. రాబోయే రోజుల్లో కూడా ఇలాంటి మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టి పేద విద్యార్థుల చదువుకు మా వంతు సహకారం అందిస్తామని స్పష్టం చేశారు. అభినందనలు, సాఫ్ట్‌వేర్ దంపతుల ఉదారతను పాఠశాల ఉపాధ్యాయులు స్థానికులు మరియు విద్యార్థుల తల్లిదండ్రులు కొనియాడారు.

# నీరు వృథా.. అధికారుల పర్యవేక్షణ ఏదీ?

- గుమ్మడిదల 12వ వార్డులో పొంగిపొర్లుతున్న ట్యాంకు నీరు
- చర్యలు తీసుకోవాలని కాలనీవాసుల విజ్ఞప్తి

**గుమ్మడిదల, (సిరి న్యూస్):**





ఓవైపు తాగునీటి కోసం ప్రజలు ఇబ్బందులు పడుతుంటే మరోవైపు అందుబాటులో ఉన్న నీరు వృథాగా రోడ్డుపాలవుతోంది. గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని 12వ వార్డులోని హనుమాన్ టెంపుల్ వద్ద ఏర్పాటు చేసిన నీటి ట్యాంకు నుంచి నీరు నిరంతరం పొంగిపొర్లుతుండటంపై కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ట్యాంకు నిర్వహణపై మున్సిపల్ అధికారుల పర్యవేక్షణ కొరవడటమే ఈ పరిస్థితికి కారణమని వారు పేర్కొంటున్నారు. ఎవరికి నచ్చిన విధంగా వారు బోర్లు వేసుకోవడం, నీటి సరఫరాపై సరైన నియంత్రణ లేకపోవడంతో ట్యాంకు నిండిన నీరు వృథాగా పోతోందని స్థానికులు చెబుతున్నారు. నీటి కొరత ఎదురయ్యే రోజులు ముందున్న నేపథ్యంలో, అందుబాటులో ఉన్న నీటిని ఇలా వృథా చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నిస్తున్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి ట్యాంకు వద్ద తగిన ఏర్పాట్లు చేపట్టడంతో పాటు, అవసరానికి అనుగుణంగా నీటిని నింపి ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు. నీటి విలువను గుర్తించి, ప్రతి చుక్కను సద్వినియోగం చేసుకునేలా అధికారులు ఇప్పటికైనా స్పందించాలని కోరుతున్నారు.

# పల్లెల్లో నిఘా నేత్రాల నిఘ





- భద్రత పై మండల యువ సర్పంచుల దృష్టి

**వెల్దుర్తి అక్టోబర్ 10 (సిరి న్యూస్):**

వెల్దుర్తి మండలంలోని కొత్తగా ఎన్నికైన గ్రామాల సర్పంచులు తమ గ్రామాల్లో భద్రతపై దృష్టి సారిస్తున్నారు. గ్రామ పరిపాలన బాధ్యతలు చేపట్టిన కొందరు సర్పంచులు పోలీసుల చొరవతో నేరాల నియంత్రణకు, గ్రామ భద్రతకు కీలకమైన సీసీ కెమెరాలు ఏర్పాటుకు నడుం బిగించారు. ఇటీవల గ్రామాల్లో దొంగతనాలు, రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకున్నడంతో నేర పరిశోధనకు, నేరాల నియంత్రణ కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు ప్రాముఖ్యతను గుర్తించారు. ఏ క్రమంలో కొత్తగా ఎన్నికైన సర్పంచ్లు కొందరు తమ గ్రామాల్లో సిసి కెమెరాలు ఏర్పాటు చేయించడానికి చర్యలు చేపట్టారు. దీనితో గతంలో పట్టణాలకి పరిమితమైన సీసీ కెమెరాలు అన్నిగా ఇప్పుడు మారుమూల చిన్న పల్లెలకు సైతం విస్తరిస్తోంది. కొద్దిపాటి ఖర్చుతో ఏర్పాటు చేసే సీసీ కెమెరాలు అన్నియంతనకు అడ్డుకట్ట వేసే విధంగా పనిచేస్తుండడంతో చిన్న చిన్న పల్లెల్లో సైతం సీసీ కెమెరాలు ఏర్పాటు జోరుగా సాగుతోంది. వెల్దుర్తి మండల పరిధిలో ఇటీవల కొత్తగా ఎన్నికైన చిన్న గ్రామపంచాయతీలుగా గుర్తింపు పొందిన యశ్వంతరావు పేట్, గ్రామానికి చెందిన సర్పంచు మల్లేశం గౌడ్, ఉప సర్పంచ్ బాబు, గ్రామాల్లో తమతో పాటు దాతల సహకారంతో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయిస్తూ, ఆయా పంచాయతీ కార్యాలయంలో సీసీ కెమెరాలు వీడియో రికార్డు నిక్షిప్తమయ్యేందుకు రికార్డు సిస్టం ఏర్పాటు చేస్తున్నారు. ఒక సీసీ కెమెరా నేర నియంత్రణలో 100 మంది పోలీసులకు సమానమని తరుచుగా చెబుతుండడంతో ఆచరణ దిశగా భాగస్వాములు అవుతున్నారు. వెల్దుర్తి మండల సర్పంచులు ఆవాస ప్రాంతంలో సీసీ కెమెరాలు ఏర్పాటు వల్ల ఉపయోగాలు ప్రజా ప్రతినిధులకు వివరించి, ప్రతి మారుమూల ఆవాస ప్రాంతంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించే విధంగా పోలీసుల ద్వారా చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో మండలంలో మారుమూల పల్లె ప్రాంతాల్లో సర్పంచ్ల సహకారంతో సిసి కెమెరాలు ఏర్పాటు చేయుచున్నారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు ముందుకు వచ్చే సర్పంచ్లను పోలీసులు ప్రోత్సహిస్తున్నారు. దీనితో మండల వ్యాప్తంగా సీసీ కెమెరాల ఏర్పాటు ఇప్పుడు ఊపందుకుంది.







**సీసీ కెమెరాలతో నేర నియంత్రణ**

మండలంలోని అన్ని వార్డుల్లో గ్రామాల్లోని ప్రధాన కూడలిలో సీసీ కెమెరాలు ఏర్పాటుకు కృషి జరుగుతోంది. ప్రతి వార్డుల్లో అలాగే గ్రామాల్లో సర్పంచ్ల భాగస్వామ్యంతో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయించడానికి కృషి చేస్తున్నాం. ఈ మేరకు మండల వ్యాప్తంగా ప్రజాప్రతినిధులతో నేర నియంత్రణ, డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలు, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్టపై అవగాహన కార్యక్రమాన్ని కూడా ఏర్పాటు చేస్తున్నాం. వీలైనంత తొందరలో సీసీ కెమెరాలను ప్రతి కూడలిలో ఏర్పాటు చేయడం జరుగుతుంది.అని ఎస్సై కరుణాకర్ రెడ్డి తెలిపారు.

**వెల్దుర్తి ఎస్సై కరుణాకర్ రెడ్డి**

# న్యాయం కోసం వస్తే.. చావును ప్రస్తావించిన అధికారి!



- 'ఇంకా బతికే ఉన్నావా.. పురుగుల మందు తాగలేదా?' అంటూ రైతుపై ఎమ్మార్వో వెటకారం చేసినట్లు ఆరోపణలు

**గజ్వేల్, అక్టోబర్ 10(సిరి న్యూస్ )**

వ్యవసాయ భూమి సమస్యతో ఇబ్బందులు పడుతున్న ఓ రైతు న్యాయం కోసం గజ్వేల్ ఎమ్మార్వోను ఆశ్రయించగా.. ఆయన వ్యవహరించిన తీరుపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సమస్యను పరిష్కరించి బాధిత రైతుకు భరోసా ఇవ్వాల్సిన అధికారి.. అందుకు విరుద్ధంగా అవహేళనగా మాట్లాడినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. 'నువ్వు ఇంకా బతికే ఉన్నావా? పురుగుల మందు తాగలేదా?' అంటూ ఎమ్మార్వో ప్రశ్నించినట్లు సమాచారం. తన పరిస్థితిని చూసి నవ్వుతారా? అని రైతు ప్రశ్నించగా.. 'అవును.. నవ్వు వస్తది, బరాబర్ వస్తది' అని సమాధానమిచ్చినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. భూమి సమస్యతో ఇప్పటికే ఇబ్బందులు పడుతున్న రైతు పట్ల అధికారి ఇలా మాట్లాడినట్లు వస్తున్న ఆరోపణలు ఆందోళన కలిగిస్తున్నాయి.

**ఉన్నతాధికారులు స్పందించాలి**

రైతుల సమస్యలను సానుభూతితో విని, నిబంధనల ప్రకారం పరిష్కరించాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. అలాంటిది న్యాయం కోసం వచ్చిన రైతును కించపరిచేలా మాట్లాడినట్లు ఆరోపణలు రావడం చర్చనీయాంశంగా మారింది. ఈ ఘటనపై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపి, ఆరోపణల్లో వాస్తవాలను నిగ్గుతేల్చాలని, బాధ్యులుగా తేలిన వారిపై తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# ఆటో దొంగతనాల దొంగ అరెస్ట్




- ఆటో స్వాధీనం.
- సిఐ డి.వెంకటేష్.

**సదాశివపేట.అక్టోబర్ 10. (సిరిన్యూస్)**

సదాశివపేట పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద సెప్టెంబర్ 29 నాడు తెల్లవారు జామున సమయంలో గుర్తు తెలియని ఒక వ్యక్తి బస్టాండ్ బయట పార్క్ చేసిన అటువంటి ఆటోను దొంగలించినట్లు ఫిర్యాదు అందిన మేరకు ఇన్స్పెక్టర్ డి. వెంకటేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. నిందితున్ని పట్టుకోవడానికి పోలీసులు శాస్త్రీయ పద్ధతిలో కృషి చేసి నిందితుడిని గుర్తించి నిందితుని నుంచి దొంగతనం అయిన ఆటోను రికవరీ చెయ్యడం జరిగింది. నిందితుడు చౌహాన్ గోవింద్ అను వ్యక్తి మద్యానికి బానిసై చెడు వ్యసనాలకు జల్సాలకు అలవాటు పడి, పెళ్లి అయి భార్యతో విడిపోయి, అతను సంపాదించే డబ్బులు సరిపోక సదాశివపేట, హైదరాబాద్, వరంగల్, రాచకొండ పరిధిలలో దొంగతనలు చేసి పలు మార్లు జైలుకు వెళ్లి వచ్చినట్లు దర్యాప్తులో వెల్లడైనట్లు ఇన్స్పెక్టర్ వెంకటేష్ తెలిపారు. నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు కేసు దర్యాప్తు నిమిత్తం జ్యుడీషియల్ రిమాండ్ కి తరలించారు.

# బానిస కార్మిక వ్యవస్థ నిర్మూలనపై అవగాహనకు

- స్వేచ్ఛా రథం ప్రారంభించిన: జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ IPS
- బానిస కార్మిక వ్యవస్థను అరికట్టి, బాధితులకు అండగా నిలవాలి: ఎస్పీ

**నారాయణపేట, అక్టోబర్,10(సమయం న్యూస్)**



తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన బానిస కార్మిక వ్యవస్థ నిర్మూలన, కార్మికుల హక్కులపై అవగాహన కల్పించే కార్యక్రమంలో భాగంగా 'ఇంటర్నేషనల్ జస్టిస్ మిషన్ NGOs ఆధ్వర్యంలో బానిస కార్మిక వ్యవస్థ నిర్మూలన అవగాహన వాల్ పోస్టర్ ఆవిష్కరించారు.అనంతరం నారాయణపేట జిల్లాలో స్వేచ్ఛా రథాన్ని జిల్లా ఎస్పీ డాక్టర్ జి. వినీత్ IPS ప్రారంభించారు .ఈ ప్రచార వాహనం జిల్లాలో రెండు రోజులు వివిధ ప్రాంతాల్లో పర్యటిస్తూ బానిస కార్మిక వ్యవస్థపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు, కార్మికుల హక్కులు, బాధితులకు అందుబాటులో ఉన్న సహాయంపై ప్రచారం నిర్వహిస్తుంది.బానిస కార్మిక వ్యవస్థకు సంబంధించిన ఘటనలు ఎదురైతే లేదా అనుమానాస్పద కేసుల గురించి సమాచారం తెలిస్తే వెంటనే అధికారులకు తెలియజేయాలని ఎస్పీ సూచించారు. బాధితులు తమ సమస్యలను తెలియజేసేందుకు టోల్ ఫ్రీ హెల్ప్‌లైన్ నంబర్ 08069434343 అందుబాటులో ఉందని తెలిపారు.వ్యవసాయం, ఇటుక బట్టీలు, ఆక్వాకల్చర్, గనులు, క్వారీలతో పాటు ఇతర అసంఘటిత కార్మిక రంగాల్లో పనిచేసే వారికి ఈ కార్యక్రమం ద్వారా అవగాహన కల్పించనున్నారు. బానిస కార్మిక వ్యవస్థ నిర్మూలనకు కృషి చేయనున్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పి ఎండి రియాజ్ హుల్ హక్, డీఎస్పీ లు మహేష్, లింగయ్య, RI విజయ్ భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాల్లో మొదలైన బతుకమ్మ సంబరాలు



**వెల్దుర్తి,అక్టోబర్ 10, (సిరి న్యూస్):**

వెల్దుర్తి మండలంతో పాటు పరిసర గ్రామాల్లో బతుకమ్మ పండుగ సంబరాలు ప్రారంభమయ్యాయి. మొదటి రోజు కావడంతో మహిళలు నూతన వస్త్రాలు ధరించి, రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి సంప్రదాయబద్ధంగా చిన్న,పెద్ద ఆటపాటలతో సందడి చేశారు. అనంతరం గ్రామాల్లోని చెరువుల్లో బతుకమ్మలను నిమజ్జనం చేశారు. నిమజ్జనం సందర్భంగా ఆయా గ్రామాల సర్పంచులు చెరువుల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. మహిళల సందడితో గ్రామాల్లో పండుగ వాతావరణం నెలకొంది.

# మేడ్చల్ వెంకట్రామయ్య కాలనీలో ఘనంగా బతుకమ్మ సంబరాలు



**మేడ్చల్ అక్టోబర్ 10 (సిరి న్యూస్ )**

మేడ్చల్ వెంకట్రామయ్య కాలనీలో బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. మేడ్చల్ బీఆర్ఎస్ మహిళా అధ్యక్షురాలు నీలిమ ఆధ్వర్యంలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని బతుకమ్మ వేడుకలను ఉత్సాహంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మహిళలు రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా అలంకరించి, సంప్రదాయ దుస్తులు ధరించి బతుకమ్మ పాటలు పాడుతూ ఆటపాటలతో సందడి చేశారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను మహిళలందరూ కలిసి ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. కాలనీలో పండుగ వాతావరణం నెలకొనగా, మహిళలు ఐకమత్యంతో బతుకమ్మ సంబరాల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమం తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల గొప్పతనాన్ని చాటి చెప్పారు



## రామాయంపేటలో నేటి నుంచి శ్రీ మహంకాళి మాత

# శరన్నవరాత్రి ఉత్సవాలు

- ఈ నెల 20 వరకు వేడుకలు..
- ప్రతి రోజూ అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు, పూజలు....
- మహంకాళి దేవాలయం ధర్మకర్త & ఛైర్మన్ సరాపు పాండురంగ చారి.
- కార్యనిర్వాహణాధికారి వి. రంగారావు
- దేవాలయం అర్చకులు
- జున్నోజి నాగరాజా చారి.

**రామాయంపేట, అక్టోబర్ 11 (సిరి న్యూస్) రామాయంపేట**







పట్టణంలోని శ్రీ మహంకాళి మాత దేవస్థానంలో అక్టోబర్ 11 నుంచి 20వ తేదీ వరకు నిర్వహించనున్న శరన్నవరాత్రి ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ధర్మకర్త, ఎఫ్.టి చైర్మన్ సరాపు పాండురంగ చారి తెలిపారు. 108 శ్రీ చక్రాలతోటి సుహాసిని ల చేత ప్రతిరోజు అమ్మవారికి కుంకుమార్చన కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు.దేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ప్రతిరోజూ అమ్మవారికి వివిధ రూపాల్లో అలంకరణలు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అక్టోబర్ 11న బాలా త్రిపుర సుందరి దేవిగా, 12న గాయత్రి దేవిగా, 13న అన్నపూర్ణాదేవిగా, 14న కాత్యాయనీ దేవిగా, 15న లలితా త్రిపుర సుందరిగా, 16న సరస్వతీ దేవిగా, 17న మహాలక్ష్మీ దేవిగా, 18న దుర్గాదేవిగా, 19న మహిషాసురమర్ధిని రూపంలో, 20న శ్రీ మహంకాళి మాతగా అమ్మవారిని అలంకరించి పూజలు నిర్వహించనున్నట్లు వివరించారు. ప్రతిరోజూ ఉదయం 6.30 గంటలకు నిత్యపూజలు నిర్వహించడంతో పాటు సాయంత్రం ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. అక్టోబర్ 19న మహానవమి సందర్భంగా ప్రత్యేక పూజలు, అక్టోబర్ 20న విజయదశమి పర్వదినాన ఉదయం 10.30 గంటలకు శ్రీ చక్రంతో కుంకుమార్చనలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఉత్సవాల సందర్భంగా అఖండ దీపారాధన, అష్టోత్తర శతనామార్చన, పుణ్యాహవాచనం, అంకురార్పణ తదితర ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పాండురంగ చారి వివరించారు. భక్తులు తమ గోత్రనామాలతో పూజల్లో పాల్గొనేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. పట్టణంతో పాటు పరిసర గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారి ఆశీస్సులు పొందాలని ఆయన కోరారు. ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో విజయవంతం చేయడానికి భక్తులు, పట్టణ ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. దేవి నవరాత్రి ఉత్సవాల్లో ప్రజలు అత్యధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని పాండురంగ చారి తెలిపారు.

# ఎస్ఐఆర్‌పై కాంగ్రెస్‌ది ప్రజా సమస్య కాదు_ _ _

- రాజకీయ బతుకుదెరువు కోసం... ఆడుతున్న దొంగ నాటకం!
- దొంగ ఓట్లను తొలగిస్తే కాంగ్రెస్‌కు ఎందుకంత భయం? —
- బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు
- రాగి రాములు

**రామాయంపేట, అక్టోబర్ 10 (సిరి న్యూస్)**



ఎస్ఐఆర్ (SIR) ప్రక్రియపై కాంగ్రెస్ పార్టీ చేస్తున్న విమర్శలు పూర్తిగా రాజకీయ దురుద్దేశంతో కూడుకున్నవని, ప్రజల్లో గందరగోళం సృష్టించి తన రాజకీయ పబ్బం గడుపుకోవాలనే ప్రయత్నమని భారతీయ జనతా పార్టీ మెదక్ జిల్లా ఎస్ఐఆర్ కన్వీనర్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రాగి రాములు తీవ్రంగా విమర్శించారు. “ఇది అసలు ప్రజా సమస్యే కాదు... ఓటర్ల జాబితాను ప్రక్షాళన చేస్తే కాంగ్రెస్‌కు వచ్చిన నష్టమేమిటి? చనిపోయిన వారి ఓట్లు, ఒకే వ్యక్తికి రెండు, మూడు, నాలుగు చోట్ల నమోదైన నకిలీ ఓట్లు, భారత పౌరసత్వం లేని వ్యక్తుల అనర్హమైన ఓట్లను తొలగించకూడదా? ప్రజాస్వామ్యాన్ని కాపాడటమంటే ఇదేనా కాంగ్రెస్ పార్టీ సమాధానం చెప్పాలి!” అని ఆయన నిలదీశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న కాలంలోనూ దేశవ్యాప్తంగా ఓటర్ల జాబితాల సవరణలు, ప్రత్యేక పునఃపరిశీలన ప్రక్రియలు పలుమార్లు జరిగాయని, గతంలో ఇలాంటి ప్రక్రియలను అంగీకరించిన కాంగ్రెస్ ఇప్పుడు ఎస్ఐఆర్‌పై ఎందుకు అభ్యంతరాలు వ్యక్తం చేస్తోందో ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. గతంలో అభ్యంతరం లేని ప్రక్రియ ఇప్పుడు అకస్మాత్తుగా రాజకీయ సమస్యగా ఎలా మారిందని ప్రశ్నించారు.

**నకిలీ ఓట్లపై చర్యలు తీసుకుంటే కాంగ్రెస్‌కు ఎందుకంత కడుపుమంట?**

చనిపోయిన వ్యక్తుల పేర్లు ఓటర్ల జాబితాలో కొనసాగాలా? ఒకే వ్యక్తికి రెండు, మూడు, నాలుగు ఓట్లు ఉండాలా? భారత పౌరసత్వం లేని వారు భారత ఎన్నికల్లో ఓటు వేయాలా? ఇలాంటి అక్రమాలకు అడ్డుకట్ట వేయడం రాజ్యాంగబద్ధమైన ప్రజాస్వామ్య పరిరక్షణ కాదా? అని రాగి రాములు ప్రశ్నించారు. ఓటర్ల జాబితాలో అర్హులైన ప్రతి భారత పౌరుడి ఓటు సురక్షితంగా ఉండాలి. అదే సమయంలో మరణించినవారి పేర్లు, నకిలీగా లేదా అనర్హంగా నమోదైన ఓట్లను నిబంధనల ప్రకారం పరిశీలించి సరిచేయాలి. అర్హులైన ఒక్క ఓటరుకూ అన్యాయం జరగకుండా చూడటం ఎంత ముఖ్యమో, అనర్హమైన నమోదులను తొలగించడం కూడా అంతే ముఖ్యమని స్పష్టం చేశారు.

ప్రజల నేరుగా మద్దతు పొంది, నిజాయితీగా ఎన్నికల్లో గెలవాలి తప్ప, నకిలీ ఓట్లపై ఆధారపడే రాజకీయాలకు ప్రజాస్వామ్యంలో స్థానం ఉండకూడదు. అర్హులైన ఓటర్లకు నష్టం కలగకుండా, చట్టబద్ధమైన విధానంలో ఓటర్ల జాబితాను ప్రక్షాళన చేయడాన్ని కాంగ్రెస్ ఎందుకు వ్యతిరేకిస్తోందో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

**దేశ ప్రయోజనాల కంటే పార్టీ ప్రయోజనాలే ముఖ్యమా?**

భారతదేశం అభివృద్ధి చెందడం, ప్రపంచ దేశాల ముందు గౌరవంగా నిలవడం కాంగ్రెస్‌కు ఇష్టం లేనట్టుగా దాని వైఖరి కనిపిస్తోందని రాగి రాములు విమర్శించారు. దేశ ప్రయోజనాల కంటే తమ పార్టీ మనుగడ, నాయకుల రాజకీయ భవిష్యత్తు, వ్యక్తిగత ప్రయోజనాలకే కాంగ్రెస్ ప్రాధాన్యత ఇస్తోందని ఆరోపించారు.

విదేశాలకు వెళ్లి భారతదేశ ప్రతిష్ఠను దెబ్బతీసేలా మాట్లాడటం, దేశంలోని రాజ్యాంగబద్ధ సంస్థలపై ఆధారాలు లేకుండా ఆరోపణలు చేయడం కాంగ్రెస్ రాజకీయ దిగజారుడుతనానికి నిదర్శనమని అన్నారు. “దేశం ఏమైపోయినా సరే, మా కాంగ్రెస్ పార్టీ బతకాలి, మా నాయకులు బతకాలి, అధికారంలో ఉండాలి, రాజకీయంగా లబ్ధి పొందాలి అనే ధోరణి ప్రజాస్వామ్యానికి ప్రమాదకరం” అని ఘాటుగా వ్యాఖ్యానించారు.

**ఎస్ఐఆర్ ప్రక్రియకు నేనే ప్రత్యక్ష సాక్షిని!**

మెదక్ జిల్లా ఎస్ఐఆర్ కన్వీనర్‌గా జిల్లా వ్యాప్తంగా జరిగిన ప్రక్రియను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించామని రాగి రాములు తెలిపారు. ప్రతి బూత్ స్థాయి నుంచి ఓటర్ల జాబితాల పరిశీలన, బూత్ స్థాయి ఏజెంట్ల పని, సంబంధిత అధికారుల చర్యలను గమనిస్తూ వచ్చామని చెప్పారు. “మెదక్ జిల్లా అంతటా ఎస్ఐఆర్ ప్రక్రియను మేము నిశితంగా పర్యవేక్షించాం. నా పరిశీలనలో బీఎల్‌వోలు, ఈఆర్‌వోలు, ఆర్డీవోలు, కలెక్టర్ సహా సంబంధిత అధికారులు ఎక్కడా అనవసరంగా ఒక్క ఓటును కూడా తొలగించలేదని నేను స్పష్టం చేస్తున్నాను. ఎక్కడైనా తప్పు జరిగిందని నిర్దిష్ట ఆధారాలతో చూపిస్తే పరిశీలించాలి. కానీ ఆధారాలు లేకుండా మొత్తం ప్రక్రియనే తప్పుబట్టడం, ప్రజల్లో భయాందోళనలు సృష్టించడం సరైన పద్ధతి కాదు” అని రాగి రాములు అన్నారు. అర్హులైన ఓటర్ల పేర్లు తొలగించబడ్డాయని ఎవరైనా భావిస్తే, వారు సంబంధిత అధికారులను సంప్రదించి చట్టబద్ధమైన మార్గాల్లో తమ అభ్యంతరాలు తెలియజేయాలని సూచించారు. ఓటు హక్కు పరిరక్షణకు బీజేపీ కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. రాజ్యాంగబద్ధమైన ఎన్నికల సంఘం తన విధులను నిర్వర్తిస్తున్నప్పుడు, దాని ప్రతి చర్యను రాజకీయ కోణంలో విమర్శించడం తగదని రాగి రాములు అన్నారు. ఏ సంస్థపైనా అభ్యంతరాలు ఉంటే ఆధారాలతో, చట్టబద్ధమైన పద్ధతుల్లో ప్రశ్నించాలి తప్ప, ప్రజల్లో సంస్థల పట్ల అపనమ్మకం కలిగించేలా వ్యవహరించకూడదని పేర్కొన్నారు. అవసరమైన సందర్భాల్లో న్యాయస్థానాలను ఆశ్రయించడం ప్రతి ఒక్కరి హక్కేనని, అయితే సుప్రీంకోర్టు సహా రాజ్యాంగ సంస్థలపై నిరాధారమైన ఆరోపణలు చేయడం ప్రజాస్వామ్య వ్యవస్థపై ప్రజలకు ఉన్న విశ్వాసాన్ని దెబ్బతీస్తుందని అన్నారు. ప్రజాస్వామ్యాన్ని మీ రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకోవాలనే ప్రయత్నాలను ఇకనైనా ఆపండి. మీకు నచ్చినప్పుడు ఓటర్ల జాబితా సరైనదని, మీకు నచ్చనప్పుడు అదే జాబితా తప్పని చెప్పే ద్వంద్వ వైఖరిని ప్రజలు అర్థం చేసుకుంటున్నారు. మీ రాజకీయ పునాదులు ఎందుకు కదులుతున్నాయో ఆత్మపరిశీలన చేసుకోండి. ప్రజలను తప్పుదోవ పట్టించే నాటకాలతో ఇకపై రాజకీయ లబ్ధి పొందలేరు” అని రాగి రాములు ఘాటుగా హెచ్చరించారు

# కేసీఆర్ తోనే జిల్లాల ఏర్పాటు

- మెదక్ జిల్లా ఆవిర్భావానికి పదేళ్లు.
- కేసీఆర్ కృషిని గుర్తుచేస్తూ మెదక్‌లో బీఆర్ఎస్ కాగడాల ర్యాలీ.
- 60 ఏళ్ల ప్రజల ఆకాంక్షకు ప్రత్యేక జిల్లా రూపం.
- మెదక్ ప్రజల 60 ఏళ్ల ఆకాంక్ష నెరవేర్చిన ఘనత కేసీఆర్ దే.
- జిల్లా ఏర్పాటు దశాబ్ది ఉత్సవాల సందర్బంగా కాగడాల ర్యాలీ.
- మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మాదేవేందర్‌రెడ్డి,ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి,ఎమ్మెల్సీ యాదవరెడ్డి.మాజీ ఎమ్మెల్సీ శేరి. సుభాష్ రెడ్డి.







**మెదక్ అక్టోబర్,10(సిరి న్యూస్)**

మెదక్ ప్రజల ఆరు దశాబ్దాల ఆకాంక్షను మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సాకారం చేశారని మాజీ డిప్యూటీ స్పీకర్,బీఆర్ఎస్ మెదక్ జిల్లా అధ్యక్షురాలు పద్మాదేవేందర్‌రెడ్డి అన్నారు. మెదక్ జిల్లా ఏర్పాటై పదేళ్లు పూర్తయిన సందర్భంగా శనివారం పట్టణంలో బీఆర్ఎస్ నాయకులు కాగడాల ర్యాలీ నిర్వహించారు. క్రిస్టల్ గార్డెన్ నుంచి ప్రారంభమైన ర్యాలీ ఆర్టీసీ డిపో వరకు కొనసాగింది. ఈ సందర్భంగా కాగడాలు చేతబూని జిల్లా ఏర్పాటు ప్రాధాన్యాన్ని, మెదక్ అభివృద్ధికి కేసీఆర్ చేసిన కృషిని నాయకులు గుర్తుచేశారు. ఈ సందర్భంగా పద్మదేవేందర్ రెడ్డి మాట్లాడుతూ.. మెదక్ ప్రజలు దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న ప్రత్యేక జిల్లా కలను కేసీఆర్ నిజం చేశారని పేర్కొన్నారు. గతంలో మెదక్‌ను జిల్లా కేంద్రంగా ప్రకటించినప్పటికీ ప్రభుత్వ కార్యాలయాలు సంగారెడ్డిలోనే ఉండేవని గుర్తు చేశారు.మెదక్ ఎమ్మెల్యేగా తాను ప్రాతినిధ్యం వహిస్తున్న సమయంలోనే ప్రత్యేక జిల్లా ఏర్పాటు కావడం తన రాజకీయ జీవితంలో మరిచిపోలేని ఘట్టమని అన్నారు. నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి,ఎమ్మెల్సీ యాదవరెడ్డి,మాజీ ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డిలు మాట్లాడుతూ.. ప్రత్యేక జిల్లా ఏర్పాటుతో పరిపాలన ప్రజలకు చేరువైందని, ప్రభుత్వ సేవలు స్థానికంగానే అందుబాటులోకి వచ్చాయని వివరించారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో మెదక్‌ను ప్రత్యేక జిల్లాగా ఏర్పాటు చేయడంతో పాటు కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయం, మాత శిశు సంరక్షణ కేంద్రం,ఇతర ప్రభుత్వ కార్యాలయాలను అందుబాటులోకి తీసుకొచ్చారని తెలిపారు. మెదక్ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో మెడికల్ కళాశాల మంజూరు నిధులు చేశారని పేర్కొన్నారు. ఘనపూర్ ప్రాజెక్టుకు మరమ్మతులు చేపట్టడం ద్వారా సాగునీటి సదుపాయాల మెరుగుదలకు కృషి చేశారని గుర్తు చేశారు. జిల్లా కోసం ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూశారని, వారి ఆకాంక్ష నెరవేరడంతో మెదక్ అభివృద్ధికి కొత్త దిశ ఏర్పడిందని పేర్కొన్నారు. జిల్లా ఏర్పాటుతో పాటు వైద్య, పరిపాలనా సదుపాయాల కల్పనలో కేసీఆర్ చేసిన కృషిని ప్రజలు ఎప్పటికీ మరిచిపోరని అన్నారు. తెలంగాణలోని అన్ని జిల్లాలు సమగ్రంగా అభివృద్ధి చెందాలంటే కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి కావాలని ప్రజలు కోరుకుంటున్నారని అన్నారు. కేసీఆర్ నాయకత్వంలోనే తెలంగాణ అభివృద్ధి పరుగులు పెడుతుందని, అన్ని జిల్లాలకు సమాన ప్రాధాన్యం లభించి, అభివృద్ధి ఫలాలు ప్రజలకు చేరుతాయని పేర్కొన్నారు. తెలంగాణ ప్రగతి పథంలో ముందుకు సాగాలన్నా, ప్రజల ఆకాంక్షలు నెరవేరాలన్నా కేసీఆర్ నాయకత్వం మళ్లీ రావాల్సిన అవసరం ఉందని వారు అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలో 33 జిల్లాలను ఏర్పాటు చేయడంతో పాటు 12 వేల గ్రామపంచాయతీలను ఏర్పాటు చేసిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు. త్వరలో నవోదయ విద్యాలయం కూడా అందుబాటులోకి రానుందని తెలిపారు. మెదక్ ప్రాంతానికి విద్య, వైద్యం, రవాణా రంగాల్లో సదుపాయాలు కల్పించేందుకు కేసీఆర్ ప్రభుత్వం కృషి చేసిందని అన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజలకు కష్టాలు పెరిగాయని విమర్శించారు. కేసీఆర్ హయాంలో తెలంగాణ అభివృద్ధి దిశగా ముందుకు సాగితే, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక మెదక్ జిల్లా అభివృద్ధి వెనుకబడిందని ఆరోపించారు. మెదక్ జిల్లాలో వరదలు సంభవించిన సమయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యటించి బాధితులకు ఆర్థిక సాయం అందిస్తామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. అయితే రూ.కోటి నిధులు ఇస్తామని ప్రకటించినప్పటికీ, ఇప్పటివరకు ఆ హామీ నెరవేర్చలేదని విమర్శించారు.సింగూరు ప్రాజెక్టు మరమ్మతుల పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం నీటిని వృథా చేసిందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ మాజీ చైర్ పర్సన్, హేమలత శేఖర్ గౌడ్,మున్సిపల్ మాజీ చైర్మన్ ఆరేళ్ల. మల్లికార్జున్ గౌడ్,మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ లు బట్టి.జగపతి,ఆకిరెడ్డి. కృష్ణారెడ్డి, గంగా. నరేందర్, పట్టణ పార్టీ కన్వీనర్ కౌన్సిలర్ మామిళ్ళ ఆంజనేయులు, మున్సిపల్ కౌన్సిలర్ లు జుబెర్ అహ్మద్, సోహెల్, దీపక్ కుమార్,మాజీ కౌన్సిలర్ లు విజయలక్ష్మి, భీమరి. కిషోర్, మాయ. మల్లేశం,మెదక్, హవెలిఘనపూర్, శంకరంపేట్ ఆర్,మండల పార్టీ అధ్యక్షులు యం. అంజ గౌడ్, సిహెచ్. శ్రీనివాస్ రెడ్డి,పట్లోరి. రాజు, రామాయంపేట పిఎసిఎస్ చైర్మన్ బాదే. చంద్రం,మెదక్ మెదక్,నర్సాపూర్ నియోజకవర్గంలో మండలాల నాయకులు సర్పంచ్ లు,మాజీ సర్పంచ్ లు,మాజీ ఎంపీటీసీలు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# రామాయంపేటలో ఘనంగా బతుకమ్మ సంబరాలు..





- మహిళలతో కలిసి బతుకమ్మ ఆడిన మున్సిపల్ చైర్‌పర్సన్.
- మల్లెచెరువు వద్ద సీసీ రోడ్డు, వీధి దీపాల ఏర్పాటుపై మహిళల హర్షం.

**రామాయంపేట, అక్టోబర్ 10 (సిరి న్యూస్)**

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ సంబరాలు రామాయంపేట మున్సిపాలిటీ పరిధిలో ఘనంగా ప్రారంభమయ్యాయి. తొమ్మిది రోజులపాటు నిర్వహించే బతుకమ్మ వేడుకల్లో భాగంగా మొదటి రోజు ఎంగిలిపూల బతుకమ్మను మహిళలు, యువతులు ఉత్సాహంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ పాలకవర్గం మహిళలకు ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేసింది.

**మహిళలతో కలిసి బతుకమ్మ ఆడిన చైర్‌పర్సన్**

బతుకమ్మ సంబరాల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ గజవాడ లావణ్య నాగరాజు గుప్తతో పాటు మున్సిపల్ మహిళా కౌన్సిలర్లు పాల్గొన్నారు. మహిళలతో కలిసి బతుకమ్మ పాటలు పాడుతూ, సంప్రదాయ ఆటలు ఆడుతూ సంబరాల్లో ఉత్సాహంగా పాలుపంచుకున్నారు. మహిళలతో మమేకమై బతుకమ్మ వేడుకల్లో పాల్గొనడంతో అక్కడ పండుగ వాతావరణం నెలకొంది.

**మల్లెచెరువు వద్ద సీసీ రోడ్డు నిర్మాణంతో ఊరట**

రామాయంపేటలో బతుకమ్మ నిమజ్జనానికి ప్రధాన కేంద్రంగా ఉన్న మల్లెచెరువు వద్ద ఎన్నో రోజులుగా పెండింగ్‌లో ఉన్న సీసీ రోడ్డు నిర్మాణ పనులు ఎమ్మెల్యే రోహిత్ రావు ఆదేశాల మేరకు చేపట్టడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గతంలో చెరువు వద్దకు బతుకమ్మలను తీసుకెళ్లే సమయంలో దుమ్ము, ధూళితో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారమని మహిళలు తెలిపారు. రహదారి సరిగా లేకపోవడంతో బతుకమ్మలు కిందపడిన సందర్భాలు కూడా ఉన్నాయని గుర్తుచేశారు. ప్రస్తుతం నూతన మున్సిపల్ పాలకవర్గం ఆధ్వర్యంలో సీసీ రోడ్డు నిర్మాణం, వీధి దీపాల ఏర్పాటు చేపట్టడంతో బతుకమ్మలను తీసుకెళ్లేందుకు సౌకర్యంగా మారిందని మహిళలు సంతోషం వ్యక్తం చేశారు. గతంలో బతుకమ్మలను చెరువు వద్దకు తీసుకెళ్లాలంటేనే భయాందోళనకు గురయ్యేవారమని, ప్రస్తుతం ఏర్పాట్లు బాగున్నాయని పేర్కొన్నారు. సౌకర్యాలు కల్పించిన మున్సిపల్ పాలకవర్గానికి కృతజ్ఞతలు తెలిపారు.

**అన్ని చెరువుల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు**

ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు ఆదేశాల మేరకు పట్టణంలో అభివృద్ధి పనులను వేగవంతంగా చేపడుతున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ గజవాడ లావణ్య నాగరాజు గుప్త తెలిపారు. బతుకమ్మ నిమజ్జనాల సందర్భంగా మహిళలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మున్సిపాలిటీ పరిధిలోని అన్ని చెరువుల వద్ద అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు.

**చెరువుల వద్ద పోలీసు బందోబస్తు**

బతుకమ్మ సంబరాల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఎస్సై బాలరాజు ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది చెరువుల వద్ద బందోబస్తు నిర్వహిస్తున్నారు. నిమజ్జనానికి వచ్చే మహిళలకు ఇబ్బందులు కలగకుండా, రద్దీని నియంత్రిస్తూ శాంతిభద్రతల పరిరక్షణకు చర్యలు చేపట్టారు. మల్లెచెరువు వద్ద సీసీ రోడ్డు నిర్మాణం, వీధి దీపాల ఏర్పాటు వంటి సౌకర్యాలతో బతుకమ్మ సంబరాలు మరింత సౌకర్యవంతంగా మారాయని మహిళలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పండుగ వేళ మహిళలకు మెరుగైన సదుపాయాలు కల్పించడంపై మున్సిపల్ పాలకవర్గాన్ని అభినందిస్తున్నారు.

# ప్రజా పాలన మరింత మెరుగ్గా కొనసాగాలి.!



- కలెక్టర్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన TUWJ జిల్లా అధ్యక్షుడు బండారు యాదగిరి

**సంగారెడ్డి,అక్టోబర్ 10 ( సిరి న్యూస్ ) :**

సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ఆధ్వర్యంలో జిల్లాలో ప్రజా పాలన మరింత మెరుగ్గా కొనసాగాలని టి యు డబ్ల్యూ జే (ఐ జేయు) జిల్లా అధ్యక్షుడు బండారు యాదగిరి ఆకాంక్షించారు. పేద బడుగు వర్గాల తో పాటు జర్నలిస్టుల ఆకాంక్షలను నెరవేర్చాలని కోరారు. TUWJ IJU సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు బండారు యాదగిరి ఆధ్వర్యంలో సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్‌ను జర్నలిస్టులు శనివారం మర్యాదపూర్వకంగా కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. క్యాంపు కార్యాలయంలో కలిసి ఈ సందర్భంగా కలెక్టర్‌కు పుస్తకాలు, పెన్నులు అంద జేశారు. కలెక్టర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఆయన ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ప్రజలకు మరిన్ని సేవలు అందించాలని ఆకాంక్షించారు. ఏ అండ దండా లేని పేద ప్రజలకు పెద్ద దిక్కుగా ఉండాలని కోరారు. అందుకు తగిన ఆయురారోగ్యాలను భగవంతుడు ప్రసాదించాలని ఆకాంక్షించారు. అదేవిధంగా జిల్లాలో జర్నలిస్టులకు తోడుగా ఉండాలని జిల్లా అధ్యక్షుడు బండారు యాదగిరి విజ్ఞప్తి చేశారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి సహకారం అందించాలని పేర్కొన్నారు. దీనికి జిల్లా కలెక్టర్ మనస్ఫూర్తిగా స్పందించారు. జిల్లా ఉపాధ్యక్షుడు మతిన్, సీనియర్ జర్నలిస్టు మసూద్, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ విల్సన్, చిన్న మధ్యతరహా పత్రికల సంఘం జిల్లా అధ్యక్షుడు సిద్ధిక్ అహ్మద్, ప్రధాన కార్యదర్శి ఈశ్వర్ చవాన్, కోశాధికారి లక్ష్మణ్, ఫోటో జర్నలిస్టుల సంఘం అధ్యక్షుడు ఆరిఫ్, జర్నలిస్టులు సూర్య వెంకట్, దినేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# పదేళ్లయినా మానని విభజన గాయం.!

- బీఆర్ఎస్ అశాస్త్రీయ నిర్ణయాలపై 'ఇనగాల' నిప్పులు!
- ముక్కలైన వరంగల్ మహానగరం.. మాయని ప్రజల మనోవేదన... ఎమ్మెల్యే 'నాయిని'

**హనుమకొండ, అక్టోబరు 10**

ఉమ్మడి వరంగల్ జిల్లా విభజనతో చారిత్రక నగర అస్తిత్వం దెబ్బతినడంతోపాటు ప్రజలు పదేళ్లుగా పరిపాలనా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని డీసీసీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి విమర్శించారు. విభజనకు పదేళ్లు పూర్తయిన సందర్భంగా శనివారం ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, ఇనగాల నేతృత్వంలో కాంగ్రెస్, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించి కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఒకే గ్రేటర్ వరంగల్ పరిధిలోని ప్రజలు రెండు జిల్లాల కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోందని ఇనగాల అన్నారు. రేషన్ కార్డులు, రెవెన్యూ రికార్డులు, భూముల రిజిస్ట్రేషన్లు, కుల ధ్రువీకరణ పత్రాల కోసం ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ జన్మస్థలం అక్కంపేట ఉండే ప్రాంతానికి కాకుండా భూపాలపల్లి జిల్లాకు ఆయన పేరు పెట్టడం గత ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలకు నిదర్శనమని విమర్శించారు.జిల్లాల విభజనతో స్థానిక యువత ఉద్యోగావకాశాలు ప్రభావితమయ్యాయని, పరిశ్రమల రాక ఆశించిన స్థాయిలో లేక నిరుద్యోగ సమస్య కొనసాగుతోందని ఆరోపించారు . వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణంలో గత ప్రభుత్వం జాప్యం చేసిందని, కాంగ్రెస్ ప్రభుత్వం పనులను వేగవంతం చేసేందుకు చర్యలు చేపట్టిందని తెలిపారు. విభజనతో జరిగిన నష్టాలను సరిదిద్ది వరంగల్ సమగ్ర అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా చైర్మన్లు, కూడా ఛైర్మన్, పిసిసి సభ్యులు, జిల్లా కమిటీ, డివిజన్, మండల అధ్యక్షులు, సంఘాల అధ్యక్షులు, సీనియర్ నాయకులు,పాల్గొన్నారు.



# అక్రమ ఇసుక రవాణాపై పోలీసుల చర్యలు

- ట్రాక్టర్,టిప్పర్ పట్టివేత.

**చిన్న శంకరంపేట,మెదక్ అక్టోబర్,10(సిరి న్యూస్)**

అక్రమ ఇసుక రవాణాను అరికట్టేందుకు చేపట్టిన తనిఖీల్లో శంకరంపేట ఆర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బీసీఎస్ సిబ్బంది రెండు ఇసుక వాహనాలను పట్టుకున్నారు. మాదూర్ రోడ్డులో తనిఖీలు నిర్వహిస్తుండగా, మెదక్ రూరల్ మండలం శివాయిపల్లి గ్రామానికి చెందిన ఇసుక ట్రాక్టర్,ఇసుక టిప్పర్ లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.ఈ ఘటనపై తదుపరి చట్టపరమైన చర్యలు చేపట్టానున్నట్లు తెలిపారు.ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఇసుకను తరలించడం, అక్రమ రవాణాకు పాల్పడడం చట్టరీత్యా నేరమని పోలీసులు తెలిపారు. అక్రమ ఇసుక రవాణాకు పాల్పడే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# చారిత్రక నగరానికి చీలిక..

- రాజకీయ స్వార్థానికి వరంగల్ బలి... ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి
- స్వార్థ రాజకీయాల కోసమే జిల్లాల విభజన.. స్థానిక యువత ఉద్యోగావకాశాలకు దెబ్బ

**హనుమకొండ, అక్టోబరు 10**



కాకతీయుల చారిత్రక వారసత్వానికి ప్రతీకగా నిలిచిన వరంగల్ మహానగరాన్ని రాజకీయ ప్రయోజనాల కోసం అశాస్త్రీయంగా విభజించారని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి విమర్శించారు. జిల్లా విభజనకు పదేళ్లు పూర్తయిన సందర్భంగా శనివారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో డీసీసీ భవన్ నుంచి అశోక జంక్షన్ వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు.ఈ సందర్భంగా నాయిని మాట్లాడుతూ జిల్లాల విభజనకు కాంగ్రెస్ వ్యతిరేకం కాదని, చారిత్రక నేపథ్యం, భౌగోళిక స్వరూపం, ప్రజల అవసరాలను పరిగణనలోకి తీసుకోకుండా రాజకీయ లెక్కలతో వరంగల్‌ను విభజించడాన్నే వ్యతిరేకిస్తున్నామని స్పష్టం చేశారు. ఈ నిర్ణయంతో నగర చారిత్రక గుర్తింపుతోపాటు స్థానిక యువత ఉద్యోగావకాశాలు, స్థానికత ఆధారంగా లభించాల్సిన ప్రయోజనాలు ప్రభావితమయ్యాయని అన్నారు. వరంగల్ కోట, వేయి స్తంభాల దేవాలయం వంటి చారిత్రక కట్టడాలతో ప్రత్యేక గుర్తింపు పొందిన నగర సమగ్రతను కాపాడాల్సిన పాలకులే విభజనకు పాల్పడ్డారని విమర్శించారు. వరంగల్ నుంచి ఉద్భవించే ప్రజా ఉద్యమాలు రాష్ట్ర రాజకీయాలను ప్రభావితం చేస్తాయనే ఉద్దేశంతోనే ప్రాంతీయ ఐక్యతను దెబ్బతీశారన్న విమర్శను ఆయన వ్యక్తం చేశారు. సిద్దిపేటకు ప్రాధాన్యమిచ్చే క్రమంలో వరంగల్ అభివృద్ధిని విస్మరించారని ఆరోపించారు.విభజన వల్ల ఏర్పడిన పరిపాలనా సమస్యలు, చారిత్రక గుర్తింపునకు జరిగిన నష్టంపై గత ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. వరంగల్ ఆత్మగౌరవం, అభివృద్ధి, యువత భవిష్యత్తు కోసం కాంగ్రెస్ పోరాటం కొనసాగిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, డీసీసీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి, కుడా ఛైర్మన్ గుండు సుధారాణి, లైబ్రరీ ఛైర్మన్ అజీజ్ ఖాన్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి బొద్దిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, మాజీ కార్పొరేటర్లు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సిల్క్‌నగర్‌లో నీటి సమస్యకు పరిష్కారం



- నిరుపయోగంగా ఉన్న బోరుకు మోటారు బిగింపు.. ప్రజలకు నీటి సౌకర్యం

**ఆలేరు, అక్టోబర్ 10**

పట్టణంలోని ఏడో వార్డు సిల్క్‌నగర్‌లో నెలకొన్న నీటి సమస్యకు మున్సిపల్ అధికారులు పరిష్కారం కల్పించారు. చాలా రోజులుగా నిరుపయోగంగా ఉన్న బోరుకు మోటారు బిగించి స్థానిక ప్రజలకు నీటి సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకొచ్చారు. దీంతో వార్డు ప్రజలకు నీటి ఇబ్బందులు తగ్గనున్నాయి. ఈ సందర్భంగా ఆలేరు మున్సిపల్ చైర్‌పర్సన్ బీజన బాలమణి భాస్కర్ మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడమే తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. పట్టణంలోని వివిధ వార్డుల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి ప్రాధాన్యమిస్తున్నామని పేర్కొన్నారు. సిల్క్‌నగర్‌లో నీటి సమస్యను స్థానికుల దృష్టికి వచ్చిన వెంటనే స్పందించి, నిరుపయోగంగా ఉన్న బోరుకు మోటారు బిగించి నీటి సౌకర్యం కల్పించినట్లు వివరించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అవసరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు.చాలా రోజులుగా ఉపయోగంలో లేని బోరుకు మోటారు బిగించడంతో నీటి సౌకర్యం అందుబాటులోకి రావడంపై సిల్క్‌నగర్ వాసులు హర్షం వ్యక్తం చేశారు. సమస్యను పరిష్కరించిన మున్సిపల్ చైర్‌పర్సన్ బీజన బాలమణి భాస్కర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రేగోటి వెంకటేష్, బిరు వెంకటేష్, గొట్టిపాముల నర్సింలు, కృష్ణ, చిట్టి, మిల్ల కృష్ణ, భేదిచెందు, చింతకింది సిద్దులు, చింతకింది సత్యనారాయణ, చింతకింది బేతి ఆంజనేయులు, గారిపెల్లి యాదగిరి, రంగ, యాదగిరి, చింతకింది గణేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు యాదాద్రి జిల్లా బాలికల జట్టు

- ఆలేరు బస్టాండ్ నుంచి అశ్వారావుపేటకు పయనం

**ఆలేరు, అక్టోబర్ 10**



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేటలో ఈ నెల 10, 11, 12 తేదీల్లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి జూనియర్ బాలికల కబడ్డీ పోటీల్లో పాల్గొనేందుకు యాదాద్రి భువనగిరి జిల్లా జట్టు శనివారం ఉదయం ఆలేరు బస్టాండ్ నుంచి బయలుదేరింది. ఈ సందర్భంగా క్రీడాకారులకు పలువురు ప్రముఖులు శుభాకాంక్షలు తెలిపి వీడ్కోలు పలికారు. కబడ్డీ అసోసియేషన్ కోశాధికారి గంధమాల కుమార్ తన తల్లి జ్ఞాపకార్థం క్రీడాకారులకు దుస్తులు అందజేశారు. కౌన్సిలర్ యాట శివకుమార్ మాట్లాడుతూ అనంతరం క్రీడాకారులకు అరటిపండ్లు అందజేశారు. ఆలేరు ఎస్‌బీఐ మేనేజర్ శ్రీనివాస్ నాయక్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ ప్రతిభ కనబరిచి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు కష్టపడి చదువుతోపాటు క్రీడల్లో రాణించే వారికి మంచి భవిష్యత్తు ఉంటుందని పేర్కొంటూ క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పూల నాగేందర్, కార్యవర్గ సభ్యులు అచ్చిన సురేందర్, మంగళగిరి నరేష్, జాతీయ రిఫరీ మరాటి లింగస్వామి, ఆర్గనైజర్ పూల చంద్రకుమార్, ఫ్రెండ్స్ క్లబ్ గౌరవ సభ్యులు ఘనగాని సంపత్‌కుమార్, పారానంది రాహుల్ తేజ, అక్షయ్ పాల్, క్రీడాకారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



# యమలోకంలోని చిత్రగుప్తుడికి భూలోకంలో ఆలయాలు

సాధారణంగా మనకు మనస్సు బాగా లేక పోతే ఏం చేస్తాం.. ఏదో ఒక గుడికి పోయి కాసేపు అలా ప్రశాంతంగా కూర్చుంటాం. అలాగే పండుగలు వచ్చిన గుడికి వెళ్లి మన కష్టసుఖాలను దేవుడికి చెబుతూ ఉంటాం. ఏ దేవాలయానికి వెళ్లిన కూడా మనకు కావాల్సిన,తెలిసిన అందరూ దేవుళ్లు దర్శనమిస్తారు. కానీ ఏ గుడిలో కూడా కనిపించని ఓ దేవునికి ప్రత్యేకంగా దేవాలయాలు నిర్మించబడి ఉన్నాయి. ఈ ఆలయాల గురించి చాలా మందికి తెలియక పోవచ్చు. అదేదో కాదండీ..చిత్రగుప్త ఆలయం. ఈ పేరు వినగానే మనకు టక్కున యమలీల, యమగోల, యమదొంగ ఇలా సినిమాలే గుర్తు వస్తాయి. ఏ సినిమాలోనైనా ఆయన పాత్ర అందరిని ఆకట్టుకునేలా ఉంటుంది. అయితే ఈయనకి కూడా ఆలయాలున్నాయని మీకు తెలుసా..? .. తెలియకపోతే తెలుసుకుందాం రండీ.. మనుషులు తెల్లవారి లేచిన దగ్గరి నుంచి పడుకునే వరకు పాపాలు చేస్తుంటాడు. ఈ పాపాలు ఎవరూ చూడరు అనుకుంటారు. కానీ ఇదంతా భ్రమ , మనలోనే ఓ ప్రాణి దాగి ఉందని ఎవరూ విశ్వసించడం లేదు. ఆ ప్రాణిని సృష్టించిన సృష్టికర్త ఎవరో కాదు బ్రహ్మ. ఆ ప్రాణి పేరే చిత్రగుప్త అని గరుడ పురాణం చెబుతుంది. 'చిత్రం అంటే అద్భుతం, గుప్త అంటే రహస్యం' కనుక అతన్ని చిత్రగుప్తుడు అని పిలుస్తారు. ఈయన మనం చేసే ప్రతి పాపపు పనికీ లెక్క కట్టి చిట్టా తయారు చేస్తాడు.

యమధర్మరాజు ఆస్థానంలో చిట్టాలు రాసే చిత్రగుప్తుడికి భూలోకంలో అక్కడక్కడా దేవాలయాలు ఉన్నాయి. కానీ వీటిని వేళ్ల మీద లెక్కించొచ్చు. ముఖ్యంగా ఆసియా ఖండంలో చిత్రగుప్తుడి భక్తులు ఎక్కువగా ఉన్నారు. రాముడు సైతం చిత్రగుప్తుడిని కొలిచినట్లు పురాణ ఇతిహాసాలు చెబుతున్నాయి. అందుకే రాముడు రాజ్యమేలిన అయోధ్యలో చిత్రగుప్తుడి దేవాలయం ఉంది. స్వయంగా రాముడే ఇక్కడ పూజలు చేసినట్టు నమ్ముతారు. దీన్ని ధర్మ హరి చిత్రగుప్త దేవాలయం అని అంటారు. ఉత్తర ప్రదేశ్ రాష్ట్రంలో ఉన్న ఈ దేవాలయానికి భక్తుల తాకిడి ఎక్కువగా ఉంది. మధ్యప్రదశ్ రాష్ట్రంలో మూడు ప్రాంతాల్లో చిత్రగుప్త దేవాలయాలు ఉన్నాయి. జబల్ పూర్ లోని పూటాతాల్, షిప్రా నదీ తీరంలోని రామ్‌ఘాట్‌లో, ఉజ్జయినిలో రెండు దేవాలయాలు ఉన్నాయి. అవి దాదాపు రెండు శతాబ్దాలు దాటినవి అయి ఉంటాయి. అంటే ఒక్క మధ్య ప్రదేశ్‌లో నాలుగు చిత్ర గుప్త దేవాలయాలు ఉన్నాయి. రాజస్థాన్ అల్వార్‌లో మూడు శతాబ్దాల చిత్రగుప్త దేవాలయం ఉంది. అదే రాష్ట్రం ఉదయపూర్‌లో మరో చిత్రగుప్త దేవాలయం ఉంది.

ఇక..తెలుగు రాష్ట్రాల్లోనూ చిత్రగుప్తుడికి దేవాలయాలు ఉన్నాయి. హైదరాబాద్ పాతబస్తీ కందికల్ గేట్ ప్రాంతంలో ఈ ఆయాన్ని చూడొచ్చు. కానీ స్థానికులు చాలా మందికి ఇక్కడ చిత్రగుప్త దేవాలయం ఉందన్న విషయం తెలియదు. చిత్రగుప్తుడి గుడి గంట మోగే శబ్దం వినిపించడం కన్నా, వారికి చావు డప్పు, బంధువుల శోకాలు వినిపిస్తుంటాయి. దేవాలయం ముందు నుంచి తరచుగా పీనుగులను మోసుకెళ్లే పాడెలు కనిపిస్తుంటాయి. ఎందుకంటే దేవాలయానికి కూత వేటు దూరంలోనే నల్లవాగు స్మశాన వాటిక ఉండటంతో ఈ మార్గం గుండానే అనేక శవయాత్రలు వెళాల్సి వస్తోంది. దేవాలయ పరిసరాల్లో సాంబ్రాణి పొగ వాసనకు బదులుగా శవం కాలుతున్న వాసనలే విపరీతం. పాతబస్తీలో ఇదే అతిపెద్ద స్మశానవాటిక అని చెప్పొచ్చు.

అయితే.. చిత్రగుప్తుడికి సాధారణ రోజులతో పోలీస్తే దీపావళి రెండవ రోజు ఘనంగా ఉత్సవం జరుపుతారంటా. ఎందుకంటే ఆ రోజు యమద్వితీయ ఉంటుందని, ఆరోజు చిత్రగుప్తుడి పుట్టిన రోజు నిర్వహించే ఆచారం కొనసాగుతుంది. చావుని జయించటానికే కాదు .. ఆరోగ్యం, సంతానం, చదువు, పెళ్లి వంటి అనేక సమస్యల పరిష్కారం కోసం భక్తులు ఆయన్ని దర్శిస్తుంటారు. గుప్తునికి బుధవారం అంటే మహా ఇష్టమట. అందుకే బుధవారం ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరుగుతాయి. కేతు గ్రహ దోష నివారణకు పూజలు జరుగుతుంటాయి. ఈ దేవాలయానికి భక్తులు సంఖ్య కూడా అంతంత మాత్రమే. ఎక్కువ మంది తెలియకనా..? తెలిసి కూడా వెళ్లడంలేదా..? అనేది క్లారిటీ లేదు. ఎందుకంటే మనలోనే ఉండి మన మంచి,చెడులను లెక్కించేవారిని పూజించడంలో చప్పేమీ లేదు కదా. ఇంతటి విశిష్టమైన దేవాలయాలని ఇంకా అభివృద్ధి చేసి, గుర్తింపుని తీసుకొస్తే బాగుంటుందని పులువురు కోరుతున్నారు.





# ఆయుష్షు ను పెంచే అలవాట్లు ఇవే ..

ఎక్కువ కాలం పాటు ఆరోగ్యంగా బతకాలని చాలా మందికి ఉంటుంది. అయితే ప్రస్తుత పరిస్థితుల్లో ఎలాంటి వ్యాధులు లేకుండా దీర్ఘకాలం పాటు ఆరోగ్యంగా జీవించడమెలా? అనే సందేహం చాలా మందిలో ఉంటుంది. అయితే ఇందుకు ప్రత్యేక ప్రణాళికలు ఏవీ పాటించాల్సిన అవసరం లేదని నిపుణులు చెబుతున్నారు. సింపుల్, ప్రాక్టికల్ టిప్స్‌ని పాటిస్తే జీవితంలో పెను మార్పులు వస్తాయని సూచిస్తున్నారు. ముఖ్యంగా ఈ 5 రకాల అలవాట్లు ఆరోగ్యకరమైన, సుదీర్ఘమైన జీవితాన్ని ప్రసాదిస్తాయని చెబుతున్నారు. మరి అవి ఏంటో తెలుసుకుందాం. ఎక్కువసేపు కదలకుండా ఒకే దగ్గర కూర్చోవడం, మోడర్న్ లైఫ్‌స్టైల్‌లో ఎక్కువగా స్క్రీన్ ముందు కూర్చొని పనిచేయడం లేదా గంటల తరబడి ఓటీటీలు చూడటం కామన్‌గా మారిపోయింది. దీంతో ఈ జీవనశైలి ఇలాగే కొనసాగితే డయాబెటిస్, గుండె వ్యాధుల వంటి దీర్ఘకాలిక వ్యాధులతో పాటు మరణం ముందుగానే సంభవించే ప్రమాదం ఉంది. కాబట్టి రోజులో ఎక్కువగా అటూ, ఇటూ కదులుతూ ఉండండి. స్వల్ప దూరం పాటు నడక, వ్యాయామంతో పాటు ఇంటి పని చేయండి.

జీవనశైలిలో మార్పుల కారణంగా చాలామంది బరువు పెరగడం, ఊబకాయం బారిన పడుతున్నారు. ఇవి గుండె వ్యాధులతో పాటు కీళ్ల నొప్పులు, డయాబెటిస్ వంటి సమస్యలకు దారితీసి జీవిత కాలాన్ని తగ్గిస్తున్నాయి. అందుకే హెల్తీ వెయిట్‌ని మెయింటేన్ చేస్తే జీవిత కాలం పెరుగుతు అధ్యయనాలు చెబుతున్నాయి. బరువును పెంచే డైట్లకు బదులు వెయిట్ లాస్‌కు తోడ్పడే డైట్‌ని ఫాలో అవ్వాలి. డై బ్యాలెన్స్ చేస్తూనే క్రమం తప్పకుండా తేలికపాటి వ్యాయా చేస్తే బాడీ యాక్టివ్‌గా ఉండటంతో పాటు దీర్ఘకాలిక వ్యాధు ముప్పును నివారిస్తుంది. జిమ్‌కి వెళ్లి బరువులు ఎత్తాల్సిన అవసరం లేకుండా చిన్న చిన్న ఎక్సర్‌సైజ్‌లతో జీవిత కాల పెంచుకోవచ్చు. బ్రిస్క్ వాకింగ్, డ్యాన్సింగ్, యోగా వంటి మోడరేట్ ఫిజికల్ యాక్టివిటీలతో ప్రాణాంతక వ్యాధుల బ పడకుండా ఉండొచ్చు. వారానికి కనీసం 150 నిమిషాల మోడరేట్ ఎక్సర్‌సైజ్ చేస్తే ఎనర్జీ, మూడ్ బూస్ట్ అవడంతో పాటు ఆయుష్షు పెరుగుతుంది. మీ బాడీని బట్టి డైట్‌ని ప్లా చేసుకోండి. పోషకాలతో నిండిన ఫ్రూట్స్, వెజిటేబుల్స్, లీన్ ప్రొటీన్, హెల్తీ ఫ్యాట్ ఫుడ్స్‌ని డైట్‌లో చేర్చుకోవాలి. ఆలివ్ ఆయిల్, నట్స్, తాజా ఆహారం ఆయుష్షును పెంచగలవు. అయితే అన్ని రకాల ఫుడ్స్ శరీరానికి పడకపోవచ్చు. కాబ శరీరానికి తగిన పుష్టికరమైన ఆహారాన్ని ఎంచుకోవడం కీలకం. రెగ్యులర్‌గా హెల్తీ డైట్‌ని పాటిస్తే జీవనకాలం పెరుగుతుంది. అలానే ప్రతినెల ఓ కొత్త హెల్తీ హ్యాబిట్‌ను నేర్చుకోవడం ద్వారా జీవిత కాలం పెరుగుతుంది. నీరు ఎక్కువగా తాగడం, తీపి తినడం తగ్గించడం, స్లీప్ రొటీన్‌ ఇంప్రూవ్ చేసుకోవడం వంటి అలవాట్లు చేసుకోవాలి.

The imprint line should be printed legibly as Printed by Published by BADHE JAYASHREE on behalf of BADHE JAYASHREE, printed at and published at PLOT NO. 104, KAPIL KAUSALYA APARTMENT, SHILPA CERENY COUNTY VENCHER, POTHIREDDYPALLY, editor BADHE JAYASHREE.